విశాలాంధ్ర
విజయనగరం
పేజి నెం. 8
శుక్రవారం 19, సెప్టెంబర్ 2025

పండగ శోభ ప్రతిబింబించాలి

- అన్ని శాఖల మధ్య సమన్వయం అవసరం
- సాధారణ భక్తులకు ఇబ్బంది కలగకుండ వి.ఐ.పి దర్శనాలు
- పండగ ఏర్పాట్ల పై సమీక్షించిన జిల్లా కలెక్టర్ ఎస్.రామ్ సుందర్ రెడ్డి

విశాలాంధ్ర-విజయనగరం: శ్రీ పైడితల్లి అమ్మవారి ఉత్సవాలు ప్రతి ఒక్కరి మదిలో పవిత్రంగా నిలిచిపోయేలా నిర్వహించాలని , పండగ శోభ ప్రతిబింబించాలని జిల్లా కలెక్టర్ ఎస్.రామ్ సుందర్ రెడ్డి తెలిపారు. ప్రతి దశ లోనూ అధికారుల మధ్య సమన్వయం చేసుకుంటూ ఉత్సవాలను విజయవంతం చేయాలనీ తెలిపారు. పండగ ఏర్పాట్ల పై కలెక్టర్ గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరం లో అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ అన్ని శాఖలు వారికీ కేటాయించిన విధులను నిబద్ధత తో నిర్వర్తించాలని , సిరిమాను పవిత్రతను కాపాడుతూ భక్తుల మనోభావాలకు అనుగుణంగా నిర్వహించాలన్నారు. వి.ఐ.పి దర్శనాల వలన సాధారణ భక్తుల దర్శనాలకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా చూడాలన్నారు. సిరిమాను తిరిగే ప్రదేశం లో ఎక్కడా రోడ్డు పై గుంతలు లేకుండా చూడాలని, అలాగే పారిశుధ్యం, రక్షిత తాగు నీటి సరఫరా , బయో టాయిలెట్స్ ఏర్పాటు , నగరమంతా సుందరీకరణ , విద్యుత్ అలంకరణ తదితర పనులను మున్సిపల్ శాఖ వారు నివహిం చాలని సూచించారు. పండగలో ప్లాస్టిక్ ను వినియోగించకుండా చూడాలని, క్యూ లైన్ల వద్ద ఏర్పాటు చేసిన తాగు నీరు పేపర్ గ్లాస్ ల ద్వారా అందించాలని, వాటిని జాగ్రత్తగా వెంటనే తొలగించాలని తెలిపారు. ప్రసాదాలను ఫుడ్ ఇన్స్పెక్టర్ తనిఖీ చేయాలనీ , అలాగే అన్ని ఆర్.ఓ ప్లాంట్లను ఆర్.డి.ఓ ఆధ్వర్యం లో తనిఖీ చేయాలనీ సూచించారు. వైద్య ఆరోగ్య శాఖ ద్వారా మెడికల్ క్యాంపు ను ఏర్పాటు చేసి, అత్యవసర చికిత్స కు అవసరమగు మందులను ఏర్పాటు చేయాలనీ అన్నారు. ప్రధానంగా 6,7 తారీఖులలో తొలేల్లు, సిరిమాను ఉత్సవం సందర్భంగా ఎక్కువ మంది భక్తులు వస్తారని, శాంతి భద్రతలకు లోటు లేకుండా చూడాలని పోలీస్ శాఖ వారికీ సూచించారు. వాహనాల పార్కింగ్ కు తగు ఏర్పాట్లను చేయాలనీ, పోలీస్, ఫైర్ శాఖల అధికారులు జాగ్రత్తగా వ్యవహరించాలని అన్నారు. బారికాడింగ్ ఎత్తు పెంచాలని, లేదంటే పై నుండి దూకి వస్తున్నారని పోలీస్ వారు చేసిన విజ్ఞప్తి మేరకు కలెక్టర్ 4 అడుగుల నుండి 5 అడుగులకు పెంచాలని ఆర్ అండ్ బి అధికారులకు సూచించారు. తెప్పోత్సవం లో గజ ఈతగాళ్ళు ఉండాలని, మత్స్య వారికీ , తెప్పలను తనిఖీ చేసి సర్టిఫికేట్ ఇవ్వాలని ఆర్ అండ్ బి వారికీ సూచించారు.సంయుక్త కలెక్టర్ సేతు మాధవన్ అక్టోబర్ 1 నుండి 7 వరకు నగరమంతా సుందరీకరణ చేయాలనీ ఎం.ఎస్.ఎం.ఈ మంత్రి సూచించారని, వారి ఆదేశాల మేరకు సోషల్ మీడియా, సుందరీకరణ, ఎల్.ఈ.డి స్క్రీన్ల ఏర్పాటు చేయాలనీ సమాచార శాఖ అధికారులకు ఆదేశించారు. ఈ సమావేశం లో అదనపు ఎస్.పి సౌమ్య లత , డి.ఆర్.ఓ శ్రీనివాస మూర్తి, ఆర్.డి.ఓ కీర్తి, దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమీషనర్ శిరీష , పూజారి బంటుపల్లి వెంకట రావు, అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

21న ప్రతిభా పరీక్షలు

విశాలాంధ్ర-విజయనగరం టౌన్ : ఈనెల 21వ తేదీన అయ్య కోనేరు ఉత్తర గట్టున గల విజ్ఞాన భారతి ఉన్నత పాఠశాలలో ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం మూడు గంటల వరకు సుపథ ప్రతిభ పరీక్షలు నిర్వహించనున్నట్లు సంస్థ వ్యవస్థాపకులు యు వి ఎ ఎన్ రాజు పేర్కొన్నారు. విజయనగరం ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల లోప్రధాన ఉపాధ్యాయిని వి.రమణమ్మ, ఏపీయూఎస్ రాష్ట్ర కార్యదర్శి ఈ.రాము నాయుడు, ఎస్ టి యు నాయకులు ఎం.వి.లక్ష్మీనరసయ్య ల తో కలిసి ఆహ్వానప్రతులను ఆవిష్కరించి మాట్లాడుతూ మానవతా విలువలు, మాతృభాషా విలువలు, సంస్కృతీ సంప్రదాయ విలువల పరిరక్షణ దిశగా ఒక ప్రణాళికా బద్ధంగా గత 22 సంవత్సరాలుగా సుపథ సంస్థ కృషి చేస్తుందని వెల్లడించారు. పద్య పఠనం, శ్లోక పఠనం, దేశభక్తి గేయాలు, వ్యాసరచన, ప్రహేళిక (క్విజ్) మొదలగు అంశాలపై ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత స్థాయివిద్యార్థులకు నిర్వహించే పోటీలలో 42 పాఠశాలల నుండి సుమారు 650 మంది విద్యార్థులు పాల్గొంటారని అన్నారు విజేతలకు 21వ తేదీ సాయంత్రం బహుమతి ప్రదానం జరుగుతుందని పేర్కొన్నారు.

భీమసింగిలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ చోరీ

విశాలాంధ్ర-జామి: మండలంలోని భీమసింగి పంచాయతీలోని కొత్తభీమ సింగిలో చెరువు వద్ద నున్న అమ్మవారికోవెల వద్ద విద్యుత్‌ట్రాన్స్‌ఫార్మర్ చోరీకి గురయింది. బుధవారం రాత్రి ఈచోరీ జరిగి నట్లు స్థానికులు చెబుతున్నారు. గురువారం ఉదయం రైతులు పొలాలకు వెళ్ళే సమయంలో ఈసంఘటనను గుర్తించి వెంటనే విద్యుత్‌శాఖా అధికారులకు సమాచారం అందించారు. ట్రాన్స్‌ఫార్మర్‌లో ఉన్న రాగి వైరును తీసివేసి మిగిలిన వస్తువులను అక్కడే వదిలేశారు. ఇదే ట్రాన్స్‌ఫార్మర్ వద్ద చోరీ జరగడం ఇది నాల్గవ సారి అని, నిత్యం ఇదే తరహాలో చోరీలు జరుగుతున్నాయని స్థానిక ఎంపిటిసి ప్రతినిధి, మండల టీడీపీ కార్యదర్శి దనియాల పైడిరాజు తెలిపారు.

మహిళల శ్రేయస్సుకు స్వస్తినారి స్వశక్తి పరివార్

విశాలాంధ్ర-రేగిడి: రేగిడి ఆముదలవలస మండలంలోని కందిన గ్రామపంచాయతీ పరిధిలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో గురువారం స్వస్తినారి స్వశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా రేగిడి ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి సిహెచ్. అసిరి నాయుడు, డాక్టర్ సోహిని ప్రత్యేకంగా పాల్గొని గర్భిణీలు, బాలింతలకు పౌష్టికాహార ప్రాముఖ్యత, తల్లులు, శిశువుల ఆరోగ్య సంరక్షణకు అవసరమైన సూచనలు తెలియజేశారు .గ్రామ సర్పంచ్ కెల్లా. మన్మధరావు మాట్లాడుతూ మహిళల శ్రేయస్సు, ఆరోగ్య పరిరక్షణకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతో ఉపయోగకరమని అన్నారు. కార్యక్రమంలో పలు వైద్య సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

స్పీకర్ అయ్యన్నతో జిల్లా నేతల భేటి

విశాలాంధ్ర-కొత్తవలస: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాసనసభ సమావేశాలు సందర్భంగా గౌ.స్పీకర్ చింతకాయల అయ్యన్న పాత్రుడుని ఉమ్మడి విజయ నగరం జిల్లాకు చెందిన నేతలు ఆయన కార్యాలయంలో గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. మంత్రి గుమ్మిడి సంధ్యారాణి, ఎస్.కోట శాసనసభ్యురాలు కోళ్ల లలిత కుమారి పలువురు ముఖ్య నాయకులు భేటీఅయ్యి పలు అంశాలపై చర్చించారు.

మద్యం సీసాలతో వ్యక్తి అరెస్ట్

విశాలాంధ్ర-గజపతినగరం: మండలం లోని రామన్నపేట గ్రామంలో గురువారం గజపతినగరం ప్రొహిబిషన్ ఎక్సైజ్ జే జనార్దన్ రావు ఆధ్వర్యంలో దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో 8 మద్యం సీసాలతో లక్ష్మయ్య అనే వ్యక్తిని అదుపులోకి తీసుకున్నామని తెలిపారు. మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని వ్యక్తిపై కేసు నమోదు చేశామన్నారు. ఈ దాడుల్లో ఎస్సై శాంతిలక్ష్మి, హెచ్ సి గంగాధరుడు పాల్గొన్నారు.

పాఠశాలల సందర్శనలో ఎంఈఓ.

విశాలాంధ్ర-వేపాడ: మండలంలోని జాకేరు, కరకవలస మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలను సందర్శించారు. మండల విద్యాశాఖ అధికారి పి.బాల భాస్కరరావు గురువారం సందర్శించారు.ఈ సందర్భంగా ఆయన పాఠశాలలో గల ప్రార్థన, తరగతి గదులు, కిచెన్ గార్డెన్ తదితర విభాగాలను పరిశీలించారు.విద్యార్థులతో తెలుగు, ఇంగ్లీషు చదివించడం, రాయించడం, చతుర్విధ ప్రక్రియలపై అనుభవ పూర్వకంగా బోధనలు నిర్వహించి వర్క్‌బుక్స్‌ను తనిఖీ చేశారు.విద్యార్థుల ప్రగతిపై సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం పాఠశాలలో అందిస్తున్న రాగి జావ నాణ్యతను పరిశీలిస్తూ విద్యార్థులకు ఆరోగ్యకరమైన ఆహారాన్ని అందించాలని సూచించారు.కిచెన్ గార్డెన్ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టాలని పాఠశాల సిబ్బందికి పలు సూచనలు చేశారు. స్వచ్ఛపక్వాడ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులతో హ్యాండ్ వాష్ నిర్వహణ, పాఠశాల పరిసరాల పరిశుభ్రతను పరిశీలించారు. కార్యక్రమంలో సీ.ఆర్.ఎం.టి కె.రాంప్రసాద్ పాల్గొన్నారు.

ఉత్తరావల్లిలో ఆరోగ్య శిబిరం

విశాలాంధ్ర-మెరకముడిదాం : మండల ఉత్తరావల్లి గ్రామం లో (స్వస్థ నారీ స శక్త పరివార్ అభియాన్) మెడికల్ క్యాంపు నిర్వహించడం జరిగింది. ఉత్తరావల్లి మెడికల్ క్యాంపులో 172 మందికి తనిఖీలు చేసి మందులు పంపిణీ చేయడం జరిగింది. కౌమరదశలో ఉన్న పిల్లల కు హెచ్ బి టెస్టు చేసారు. ఈ సందర్భంగా డాక్టర్ అజిత్ బాబు మాట్లాడుతూ ఉత్తరవల్లిలో మహిళలకు పోషకహారం గురించి వ్యాధులు రాకుండా తీసువలసిన జాగ్రత్తలు ఇతర ఆరోగ్య కార్యక్రమాల గురించి తెలపడం జరిగింది. కార్యక్రమంలో సిహెచ్ఓ రామారావు, ఏఎన్ఎంలు ఎంఎల్‌హెచ్‌పి ఆశావర్కర్లు సర్పంచ్, గ్రామ పెద్దలు యువత పాల్గొన్నారు.

పశువులకు గాలికుంటు వ్యాధి టీకాలు

విశాలాంధ్ర-డెంకాడ: మండల పరిధిలోని చొల్లంగి పేట గ్రామంలో గ్రామంలో 300 పశువులకు గాలికుంటు వ్యాధి టీకాలు వైద్యాధికారి శ్రీకాంత్ ఆధ్వర్యంలో టీకాలు వేశారు. కార్యక్రమానికి మండల పరిషత్ అధ్యక్షులు వాసుదేవరావు, కంది చంద్రశేఖర రావు పాల్గొన్నారు ఈ సందర్భంగా వారు ఇరువురు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో పశు వైద్యానికి అత్యధిక ప్రాథమికనిస్తుందని అన్నారు ఈ కార్యక్రమంలో పల్లె భాస్కరరావు, చొల్లంగి పేట సర్పంచ్ కోరాడ కనకరాజు ఎంపీటీసీ గుడివాడ కిరణ్ కుమార్ , బగ్గా లక్ష్మణరావు, తొట్టడి సూర్యప్రకాష్, తొట్టడి సూరిబాబు, మహంతి చిన్నంనాయుడు, కలిసెట్టి రమణ, మహంతి నర్సింహ నాయుడు, జగదీష్ రాజు, సురేష్ బాబు హాజరయ్యారు.

పైడితల్లమ్మ జాతర నేపథ్యంలో శరవేగంగా పలు మరమ్మతు పనులు

విశాలాంధ్ర-విజయనగరం: పైడితల్లమ్మ జాతర నేపథ్యంలో నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో వివిధ మరమ్మతు పనులు శరవేగంగా సాగుతున్నాయి. విజయనగరం నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య ఆదేశాలతో ఇంజనీరింగ్ అధికారులు సిబ్బంది గుంతలు పూడ్చివేత, రహదారుల మరమ్మత్తులు, కాలువల నిర్మాణ పనులు, డివైడర్లకు రంగులు అద్దే ప్రక్రియలను యుద్ధ ప్రాతిపదికన చేపడుతున్నారు. 39 వ డివిజన్ వివేకానంద కాలనీలో బీటీ రోడ్డు నిర్మాణ పనులు చేపట్టారు. 27 వ డివిజన్ జొన్న గుడ్డి ప్రాంతంలో జెసిబి సహాయంతో పైప్ లైన్లు ఏర్పాటు అనంతరం ఉన్న వ్యర్థ నిర్మాణ సామాగ్రిని తొలగించే కార్యక్రమాలు చేపట్టారు. గురజాడ అప్పారావు రోడ్డు ప్రాంతంలో గుంతలు పూడ్చివేత కార్యక్రమాన్ని చేపట్టారు. రింగ్ రోడ్డు ప్రాంతంలో డివైడర్లకు ఉన్న గ్రిల్స్‌కు రంగుల అద్దే కార్యక్ర మాన్ని చేపడుతున్నారు. అలాగే జరుగుతున్న పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించారా లేదా అన్న విషయాన్ని ఈఈ ప్రసాదు సిబ్బందితో పరిశీలించారు. ఆర్ అండ్ బి జంక్షన్ వద్ద జరిగిన పనుల నాణ్యతను గమనించారు. మూడు లంతర్లు నుండి కోట వరకు ఉన్న రహదారి గోతులను పూడ్చివేశారు. 2వ డివిజన్ హాజీ అలీ నగర్ లో కాలువ నిర్మాణ పనులు చేపట్టారు. ఈ సందర్భంగా కమిషనర్ పల్లి నల్లనయ్య మాట్లాడుతూ పైడితల్లి అమ్మవారి జాతర నేపథ్యంలో అన్ని ప్రాంతాలలో మరమత్తు పనులు, ఇతర నిర్మాణ పనులు యుద్ధ ప్రాతిపదికను చేపడుతున్నామన్నారు. ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అవసరమైన అన్ని చర్యలను తీసుకుంటున్నామన్నారు.

విజయనగరం కలెక్టర్ కార్యాలయం వద్ద యూరియా సమస్యపై కాంగ్రెస్ నిరసన

విశాలాంధ్ర-విజయనగరం ఫోర్ట్: జిల్లాలో రైతులు పడుతున్న యూరియా సమస్యలపై వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ గురువారం విజయనగరం కలెక్టర్ కార్యాలయం వద్ద కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిరసన జరిగింది. ఆంధ్రప్రదేశ్ కిసాన్ సెల్ రాష్ట్రాధ్యక్షుడు కామన ప్రభాకర్, జిల్లా అధ్యక్షుడు మరిపి విద్యాసాగర్ ఆదేశాల మేరకు జిల్లా కిసాన్ సెల్ అధ్యక్షుడు బెవర సత్యం నాయుడు నేతృత్వంలో ఈ నిరసన కార్యక్రమం జరిగింది. అనంతరం జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, "ఇప్పటికే రెండు సార్లు కలెక్టర్‌ను కలసి రైతుల సమస్యలను వివరించాం. కానీ ఇప్పటివరకు చర్యలులేవు. ఇప్పటికైనా అధికారులు, పాలక కూటమి నేతలు రైతుల సమస్యలను పట్టించుకొని తక్షణమే సరిపడా యూరియా సరఫరా చేయాలి" అని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ శ్రీనివాస్, శేఖర్, పైడిరాజు తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తండ్రిని రాయితో కొట్టి చంపిన కసాయి...

విశాలాంధ్ర-తెర్లాం: మండలంలో ఎమ్మార్ అగ్రహారం గ్రామానికి చెందిన నగరపు. అప్పలస్వామి(85) తన కన్న కొడుకు నగరపు శంకర్రావు చేతిలో మరణించాడు. వివరాలివి. ఎమ్మార్ అగ్రహారం గ్రామానికి చెందిన నగరపు. అప్పల స్వామికి ఇద్దరు కుమారులు. చిన్న కొడుకు నగరపు శంకర్రావు తాగిన మైకంలో మాట మాటా పెరిగి తండ్రిని రాయితో తలపై బలంగా కొట్టడంతో తీవ్ర రక్తస్రావం అయింది. మనవరాలు నగరపు. కల్పన హుటాహుటీనా తెర్లాం ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా అక్కడ వైద్యం పొందుతూ తండ్రి మృతిచెందాడు. పోస్టుమార్టం నిమిత్తం బాడంగి కమ్యూనిటీ ఆసుపత్రికి తరలించారు. విజయనగరం నుండి క్లూస్ టీం సంఘటన స్థలాన్ని పరిశీలించి సేకరించిన వివరాలను సిఐ కు తెలిపారు. మనవరాలు నగరపు. కల్పన ఫిర్యాదు పై బొబ్బిలి రూరల్ సీఐ కె. నారాయణ రావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈయనతో స్థానిక ఎస్సై జి సాగర్ బాబు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

మున్సిపల్ చైర్మన్ అభివృద్ధి పనులకు శంకుస్థాపన

విశాలాంధ్ర-బొబ్బిలి: ఎమ్మెల్యే బేబినాయన ఆదేశాలతో గురువారం మున్సిపల్ చైర్మన్ రాంబార్కి శరత్ బాబు పురపాలక సంఘ పరిధిలో 15వ ఆర్థిక సంఘం నిధులతో పలు వార్డుల్లో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. 5వ వార్డు - సిరిగిడి వీధి యందు సిసి డ్రైన్ నిర్మాణం చేయుటకుఅంచనా వ్యయం 5 లక్షల రూపాయలు, 8వ వార్డు రత్నాలు నగర్ యందు సి.సి డ్రైన్ అండ్ కల్వర్ట్ చేయుటకు నిర్మాణ పనులు అంచనా వ్యయం ఆరు లక్షల రూపాయలు తో శంఖుస్థాపన చేశారు. శంఖుస్థాపన చేసిన పనులను వేగంగా పూర్తి చేయాలని సంబంధిత ఇంజనీరింగ్ అధికారులకు మరియు సంబంధిత కాంట్రాక్టర్లు లను మున్సిపల్ చైర్మన్ శరత్ బాబు ఆదేశించారు.ఈ కార్యక్రమం లో మున్సిపల్ కమీషనర్ లాలం ఎల్ రామలక్ష్మి, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కిరణ్ కుమార్, మున్సిపల్ అసిస్టెంట్ ఇంజనీర్ వి. వి.ఎస్. ఎన్. గుప్తా , పట్టణ టిడిపి అధ్యక్షులు గెంబలి శ్రీనివాసరావు, వార్డు కౌన్సిలర్ వెలగాడ హైమావతి తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

విశాలాంధ్ర-గుర్ల: శుక్రవారం ఉదయం 9గంటల నుండి సాయంత్రం 5గంటల వరకు 33/11కెవి గుర్ల సబ్‌స్టేషన్ పరిధిలో వున్న 11కేవీ అచ్యుతాపురం ఫీడర్ పై గల పెనుబర్తి , చింతపల్లిపేట, గంగిరెడ్ల పేట,అచ్యుతాపురం జంక్షన్ ఆర్టీఓ ఆఫీస్ గ్రామంలకు క్రొత్తగా లైన్ వేయుట కొరకు ఆర్డీఎస్ఎస్ పని నిమిత్తము విద్యుత్కు అంతరాయం కలుగునని డివిజనల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పి. త్రినాధరావు తెలిపారు.

గ్రామసింహాల దాడిలో ఆరుగురికి గాయాలు

విశాలాంధ్ర-మెంటాడ: మండలంలో ఎక్కడ చూసినా గ్రామ సింహాలే వాటితో ప్రజలు బెంబేలెత్తు పోతున్నారు. గ్రామంలో ఒంటరిగా వెళ్లాలంటేనే భయం వేస్తుంది. ద్విచక్ర వాహనాలు వెంబడి వీధి కుక్కలు పరుగులు తీస్తూ ప్రయాణికులను భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. దీనిపై ఎన్నోసార్లు మండల అధికారులకు ఫిర్యాదులు చేసినప్పటికీ ఎవరూ పట్టించుకున్న దాఖలు లేవు. గురువారం మెంటాడ గ్రామంలో ప్రధాన వీధిలో పట్టపగలే ఆరుగురు పై ఆకస్మిక దాడి చేసి తీవ్రంగా గాయపరిచాయి. గాయపడిన వారిని స్థానికులు తక్షణమే మెంటాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించి చికిత్స అందజేశారు . మండలంలో అనేక గ్రామాలలో ఇలాంటి ఘటనలు తరచూ పునారవృతం అవుతున్నప్పటికీ అధికారి యంత్రాంగం కుక్కలను నియంత్రించడంలేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వీధి కుక్కల నుంచి గ్రామ ప్రజలకు రక్షణ కల్పించేలా సంబంధిత శాఖ అధికారులు తక్షణమే స్పందించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

భూసేకరణ వేగంగా పూర్తి చేయాలి

కలెక్టర్ ఎస్.రామ సుందర్ రెడ్డి

విశాలాంధ్ర-విజయనగరం: వివిధ ప్రాజెక్టులకు భూసేకరణను త్వరగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఎస్.రామసుందర్ రెడ్డి ఆదేశించారు. భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం, జాతీయ రహదారులు, రైల్వే ప్రాజెక్టుల భూసేకరణపై కలెక్టరేట్లో సంబంధిత అధికారులతో గురువారం సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ముందుగా భోగాపురం విమానాశ్రయ భూసేకరణపై కలెక్టర్ సమీక్షిస్తూ, ఇప్పటివరకు జీఎంఆర్‌కు అప్పగించిన 2,200 ఎకరాల భూముల పరిస్థితి, వాటికి సంబంధించిన సమస్యలు తెలుసుకున్నారు. అలాగే విమానయాన అనుబంధ పరిశ్రమల ఏర్పాటు కోసం ఇటీవలే కేటాయించిన 540 ఎకరాల భూమికి సంబంధించిన స్థితిగతులను ఆరా తీశారు. అలాగే ట్రంపెట్ బ్రిడ్జి నుంచి విమానాశ్రయానికి వెళ్లే రహదారి నిర్మాణం, భూమి లభ్యతపై సమీక్షించారు. విమానాశ్రయం భూములనుంచి వర్షపు నీరు వెలుపలికి వెళ్లే మార్గా లు, కాలువల నిర్మాణం, సబ్‌స్టేషన్ నిర్మాణం, ప్రత్యేక విద్యుత్ లైన్లు, త్రాగునీటి సరఫరా తదితర అంశాలపై ఆరా తీశారు. వీటి భూ సేకరణకు సంబంధించిన సమస్యలేమైనా ఉంటే తక్షణమే పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశించారు. అనంతరం జాతీయ రహదారులు, రైల్వే ప్రాజెక్టులకు భూసేకరణపై కలెక్టర్ సమీక్షించారు. జాతీయ రహదారులు 130 సిడి, 516 బి కి ఇప్పటివరకు జరిగిన భూ సేకరణ, పెండింగ్ అంశాలను ఆరా తీశారు. వీలైనంత వేగంగా సేకరణ పూర్తిచేసి, భూములను అప్పగించాలని ఆదేశించారు.ఈ సమీక్షా సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఎస్.సేతు మాధవన్, డిఆర్ఓ ఎస్.శ్రీనివాసమూర్తి, ఆర్‌డిఓ డి.కీర్తి, వివిధ శాఖల ఇంజనీరింగ్ అధికారులు, భోగాపురం ఎయిర్‌పోర్ట్ ప్రాజెక్టు హెడ్ రామరాజు, జాతీయ రహదారుల పిడిలు తదితరులు పాల్గొన్నారు. ..

విజయనగరం జిల్లాలో గ్రామసభల సక్రమ నిర్వహణకు ఆదేశాలు ఇవ్వాలని విజ్ఞప్తి

విశాలాంధ్ర-విజయనగరం ఫోర్ట్: జిల్లా పంచాయతీ అధికారి (డిపిఓ) మల్లికార్జున్‌ను ఓటరు అక్షరాస్యత వేదిక వ్యవస్థాపకులు దొడ్డి సూర్యారావు, ప్రతినిధులు ఆర్. సూర్యదేముడు, ఐ. నీలకంఠం మాస్టరు, విజనగిరి గోవిందా బుధవారం ఉదయం కార్యాలయంలో కలిసి వినతిపత్రం సమర్పించారు. వచ్చే నెల అక్టోబర్ 3న గాంధీ జయంతి మరునాడు నుంచి జిల్లా వ్యాప్తంగా 777 పంచాయతీల్లో జరగనున్న రాజ్యాంగబద్ధ గ్రామసభలు సక్రమంగా నిర్వహించేందుకు తగిన ఆదేశాలు జారీ చేయాలని, గతంలో జరిగిన గ్రామసభల్లో తలెత్తిన లోపాలు పునరావృతం కాకుండా చూడాలని కోరారు. ఈ సందర్భంగా డిపిఓ మల్లికార్జున్ మాట్లాడుతూ, "మీరు లేవనెత్తిన అంశాలను గమనించాను. భవిష్యత్తులో ఆ లోపాలు పునరావృతం కాకుండా అధికారులకు తగు ఆదేశాలు ఇస్తాను. నేను కూడా ప్రత్యేక పర్యవేక్షణ చేస్తాను" అని హామీ ఇచ్చారు. తరువాత మీడియాతో దొడ్డి సూర్యారావు మాట్లాడుతూ, "2013 నుంచి స్టాట్యూటరీ గ్రామసభలు అమల్లోకి వచ్చి పుష్కరకాలం గడుస్తున్నా వాటి నిర్వహణలో పంచాయతీరాజ్ వ్యవస్థ పూర్తిగా విఫలమైంది. అధికారులు, ప్రజా ప్రతినిధులు రికార్డుల కోసం మాత్రమే గ్రామసభలు నిర్వహిస్తున్నారు. గ్రామసభ తీర్మానాల లేకుండా పంచాయతీల అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేపట్టడం రాజ్యాంగ విరుద్ధం. ప్రజలే ముందుకొచ్చి గ్రామసభల సక్రమ నిర్వహణకు కృషి చేస్తేనే పారదర్శకత, జవాబుదారీతనం పెరిగి అవినీతి తగ్గుతుంది" అని పిలుపునిచ్చారు.

20న మెగా జాబ్ మేళా

విశాలాంధ్ర-శృంగవరపుకోట: ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జవహర్ నాలెడ్జ్ సెంటర్ (జేకేసీ), ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్య అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో మెగా జాబ్ మేళా 20-09- 2025 అనగా శనివారం నాడు నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సి. హెచ్. కేశవరావు మరియు జెకెసి కోఆర్డినేటర్ డాక్టర్ జి.ఈరన్న, సంయుక్తంగా ఒక ప్రకటనలో తెలిపారు. ఈ జాబ్ మేళాకు పదవ తరగతి నుంచి పీజీ పూర్తి చేసిన 18 నుండి 35 సంవత్సరాలు గల విద్యార్థిని, విద్యార్థులు అర్హులని వారు తమ యొక్క ఒరిజినల్ సర్టిఫికెట్స్ మరియు ఆధార్ కార్డు తో ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సెమినార్ హాలు నందు హాజరు కావాలని జాబ్ మేళా కోఆర్డినేటర్, డాక్టర్ జి.ఈరన్న తెలిపారు. ఈ జాబ్ మేళాకు కాన్సెంట్ ట్రిక్స్, హెట్రో ల్యాబ్స్, కియా మోటర్స్, టాటా ఎలక్ట్రానిక్స్, ఎక్సిగా సాఫ్ట్వేర్ సొల్యూషన్స్, ఏటీసీ టైర్స్, డెక్కన్ ఫైన్ కెమికల్స్, అపోలో ఫార్మసీ, మహీంద్రా అండ్ మహీంద్రా, ఎల్ అండ్ టీ కన్స్ట్రక్షన్స్, ప్రీమియర మొదలగు కంపెనీలు హాజరు అవుతాయని అర్హత కలిగిన అభ్యర్థులను వారి కంపెనీ లో ఎంపిక చేసుకోవటం జరుగుతుందని కావున ఆసక్తి కలిగిని నిరుద్యోగ యువతియువకులు తమ వివరములను ttps://naipunyam.ap.gov.in వెబ్ సైట్ నందు తప్పనిసరిగా నమోదు చేసుకొని, రిఫరెన్స్ నెంబర్ తో పాటుగా రెస్యూమ్ ,ఆదార్ కార్డు, విద్యార్హత సర్టిఫికేట్లు ఒరిజినల్ మరియు జెరాక్స్, 1 పాస్పోర్ట్ సైజ్ ఫోటోతో ఉదయం 9 గంటలకు గవర్నమెంట్ డిగ్రీ కాలేజ్ శృంగవరపుకోట నందు హాజరు కావాలని తెలిపారు. మరిన్ని వివరాలుకు ఈ క్రింది ఫోన్ ఫోన్ నెంబర్ 7995691295 సంప్రదించాలని తెలిపారు.

విశ్వకర్మ జయంతి ఉత్సవాలలో మాజీ ఎంపీ

విశాలాంధ్ర-చీపురుపల్లి: చీపురుపల్లి పట్టణ పరిధిలోని ఆంజనేయపురం హడ్కో కాలనీలో విశ్వకర్మ జయంతి ఉత్సవాల్లో మాజీ ఎంపీ వైఎస్ఆర్సిపి నాయకులు బెల్లాన చంద్రశేఖర్ గురువారం నాడు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విశ్వకర్మ జయంతి నిర్వాహకులు మహోత్సవ భాగంగా మాజీ ఎంపీ బెల్లానకు ఘన స్వాగతం పలుకుతూ చిత్రపటాలను అందజేసి సత్కరించారు .ఈ కార్యక్రమంలో విశ్వకర్మ జయంతి ఉత్సవ నిర్వాహకులు, పట్టణ వార్డు మెంబర్లు,ఎంపీటీసీలు, హడ్కో కాలనీ గ్రామ పెద్దలు, నాయకులు తదితరులు పాల్గొన్నారు..

అభివృద్ధి, సంక్షేమం సమన్వయంతో ప్రజలు సంతృప్తి

కలెక్టర్ రామ సుందర్ రెడ్డి

విశాలాంధ్ర-విజయనగరం: అభివృద్ధి సంక్షేమం సమన్వయంగా ముందుకు సాగితే ప్రజల సంతృప్తి చెందుతారని జిల్లా కలెక్టర్ ఎస్. రామసుందర్ రెడ్డి తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి గారి అధ్యక్షతన సెప్టెంబర్ 14, 15 తేదీలలో అమరావతిలో జరిగిన కలెక్టర్ల సమావేశం అనంతరం విజయనగరం చేరుకున్న జిల్లా కలెక్టర్ గురువారం జిల్లా అధికారులతో ప్రత్యేక సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి గారి సూచనలను వివరంగా అధికారులకు తెలియజేస్తూ, వాటిని జిల్లాలో సమర్థవంతంగా అమలు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన వివిధ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ పారదర్శకంగా చేరేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ స్పష్టం చేశారు.

రైతు సంక్షేమం కోసం ఎరువులు, విత్తనాల సరఫరా, కాలువల ద్వారా సాగునీటి సరఫరా అంశాలను సమయానికి సమన్వయం చేసుకోవాలని వ్యవసాయ, నీటి పారుదల శాఖల అధికారులకు సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో మానవ వనరుల అభివృద్ధి, విద్యా ప్రమాణాల పెంపు కోసం జాగ్రత్తలు తీసుకోవాలని, తల్లికి వందనం, స్కాలర్షిప్పు సక్రమంగా అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.గ్రామీణ స్థాయిలో ఆరోగ్య సేవలు అందుబాటులో ఉండేలా ఆరోగ్య సిబ్బంది, వైద్యులు, ఔషధాల లభ్యతపై పర్యవేక్షణ చేయాలని, కలెక్టర్ ఆదేశించారు. ప్రతి శాఖా అధికారి తమ పరిధిలో గ్రీవెన్స్ సక్రమంగా పరిష్కరించాలని సూచించారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా తక్షణ సేవలు అందించడంలో నిర్లక్ష్యం చేయవద్దని సూచించారు. మౌలిక వసతుల అభివృద్ధి, రహదారులు, తాగునీటి సౌకర్యాలు, పట్టణ మరియు గ్రామీణ అభివృద్ధి ప్రాజెక్టులు సమయానికి పూర్తి చేయాలని ఆదేశించారు.జిల్లా స్థాయి అధికారులు అందరూ సమన్వయంతో పనిచేసి ముఖ్యమంత్రి గారి ఆదేశాలను కార్యరూపంలోకి తేవాలని కలెక్టర్ ప్రత్యేకంగా కోరారు. సమావేశంలో సంయుక్త కలెక్టర్ ఎస్ సేధు మాధవన్, డిఆర్ఓ శ్రీనివాస్ మూర్తి, ఆర్డీవో డి. కీర్తి, సిపిఓ పి బాలాజీ, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలం 50 సంవత్సరాలు లీజు రద్దు చేయాలి

విశాలాంధ్ర - బొబ్బిలి : 2010 సంవత్సరంలో హస్తకళల కోసం పట్టణ పరిధిలో ప్రభుత్వ ఐటిఐ పక్కనున్నటువంటి సుమారు రెండు ఎకరాల స్థలమును ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పర్యాటక శాఖకు కేటాయించిందని సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పి.శంకర్రావు, మండల కార్యదర్శి సింగిరెడ్డి గోపాలు అన్నారు. ఆ రెండు ఎకరాల ఖాళీ స్థలమును పర్యాటక శాఖ బిజెపి నాయకులకు 50 సంవత్సరాలు రిసార్ట్ వ్యాపారం నిమిత్తం కేటాయించినట్లు తెలుస్తుందని ఈ లీజులు తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రం విడిపోయాక జిల్లాలు విడిపోయాక బొబ్బిలి డివిజన్ కేంద్రంగా మారిందని డివిజన్ కేంద్రంలో అనేక ప్రభుత్వ, ప్రజల అవసరాలకు ఈ స్థలం వాడుకోవలసి ఉందన్నారు. అధికారం అడ్డం పెట్టుకొని ప్రభుత్వ స్థలాలు కబ్జా చేస్తున్నారన్నారు. తక్షణమే జోక్యం చేసుకొని లీజ్ ఒప్పందాలు రద్దు చేయాలని కోరారు. లేనిపక్షంలో పెద్ద ఎత్తున ప్రజా సంఘాలు, రాజకీయ పార్టీలను కలుపుకొని ఆందోళన చేస్తామని అన్నారు.

విజయనగరం బీసీ బాలికల వసతి గృహంలో ఆహారం కల్తీ
14 మంది విద్యార్థులు అస్వస్థత

విశాలాంధ్ర-విజయనగరం ఫోర్ట్ : పట్టణంలోని 37వ డివిజన్ పరిధి బీసీ కాలనీలో గల బీసీ బాలికల వసతి గృహంలో ఆహార విషబాధ కలకలం రేపింది. (సెప్టెంబర్ 17) రాత్రి విద్యార్థులు తిన్న ఆహారం కలుషితమవడంతో 14 మంది విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. వెంటనే స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించగా, వైద్యం పొందిన విద్యార్థులు కోలుకున్నారు. శాసనసభ సమావేశాల్లో పాల్గొంటున్న విజయనగరం ఎమ్మెల్యే పూసపాటి అదితి విజయలక్ష్మి గజపతి రాజు ఆదేశాల మేరకు నియోజకవర్గ పార్టీ నాయకులు వసతి గృహాన్ని సందర్శించి, విద్యార్థులను పరామర్శించారు. అదేవిధంగా విద్యార్థుల ఆరోగ్యం గురించి వివరాలు తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో కంది మురళి నాయుడు, గంటా రవి, కొండ్రు శీను, అనురాధ బేగం తదితరులు పాల్గొన్నారు.

వితంతువుల పింఛన్ సమస్యపై అసెంబ్లీలో ఎమ్మెల్యే గళం

విశాలాంధ్ర - విజయనగరం ఫోర్ట్: విజయనగరం శాసనసభ్యురాలు పూసపాటి అదితి విజయలక్ష్మి గజపతి రాజు శాసనసభ వర్షాకాల సమావేశాల తొలి రోజున పాల్గొని సభలో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ "2019 ఏప్రిల్ 1కి ముందు భర్తలను కోల్పోయిన వితంతువులకు ఇప్పటికీ పింఛన్లు మంజూరు కాలేదని, దీనివల్ల ఆ వర్గానికి చెందిన మహిళలు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. కనుక సంబంధిత శాఖ అధికారులు తక్షణ చర్యలు తీసుకుని పెండింగ్‌లో ఉన్న వితంతు పింఛన్లను మంజూరు చేయాలని కోరారు.ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న ఈ సమస్యను త్వరితగతిన పరిష్కరించాలని ఎమ్మెల్యే ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు.

ఉమెన్ పవర్ యాప్ పొదుపు సంఘ మహిళలకు ఒక వరం

విశాలాంధ్ర-గజపతినగరం : మండలంలోని బంగారంపేట, ఎం.గుమడాం గ్రామాలలో స్వయం సహాయక సంఘ సభ్యులకు మన డబ్బులు మన లెక్కలుపై గురువారం అవగాహన సమావేశం నిర్వహించారు. ముందుగా మన డబ్బులు మన లెక్కలుపై మహిళలు ర్యాలీ చేశారు. ఏపిఎం పి.నారాయణరావు మాట్లాడుతూ స్వయం సహాయక సంఘంలో ఉన్న ప్రతి సభ్యురాలు వారు నెలవారీ పొదుపు, తీసుకున్న అప్పులకు సంబంధించి లావాదేవీలు తెలుసుకోవడానికి ఈ ఉమన్ పవర్ యాప్ ఒక అర్థం లాంటిది అని తెలియజేశారు. ఈ యాప్ ద్వారా సంఘ సభ్యురాలు ఎప్పటికప్పుడు వారి పొదుపులు, అప్పులు తెలుసుకోవచ్చు అని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సీసీలు చంద్రశేఖర్, మూర్తి, రామనాయుడు, స్వయం సహాయక సంఘ సభ్యులు పాల్గొన్నారు.

విద్యార్థులను అభినందించిన వాకర్స్ క్లబ్ సభ్యులు

విశాలాంధ్ర - విజయనగరం ఫోర్ట్: సాయి కృష్ణా వాకర్స్ క్లబ్, అంజనీ పుత్ర చిరంజీవి వాకర్స్ క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో జాతీయ పాఠశాల క్రీడా విభాగంలో స్థానిక అయ్యన్నపేటకు చెందిన తైకొండా క్లబ్‌కు చెందిన విద్యార్థులు రెడ్డి కావ్య, కెల్ల భువనేష్‌కు అండర్ 14 రాష్ట్ర స్థాయిలో తైక్వాండో క్రీడలో ఇటీవల ఎంపికైన సందర్భంగా గురువారం ఉదయం 42వ డివిజన్ పరిధిలో అయ్యన్నపేట జంక్షన్ వద్దనున్న మున్సిపల్ కార్పొరేషన్ నడక మైదానంలో క్రీడా విద్యార్థులను, తైక్వాండో కోచ్ శేఖర్‌ను క్లబ్ సభ్యులు, ప్రముఖ సాహితీవేత్త, మాజీ పార్లమెంట్ సభ్యులు, రెగ్యులర్ వాకర్ డాక్టర్ డి.వి.జి.శంకరరావు చేతులమీదుగా సత్కరించారు. కార్యక్రమంలో శ్రీ సాయి కృష్ణా వాకర్స్ క్లబ్ అధ్యక్షులు తాడ్డి ఆదినారాయణ, అంజనీపుత్ర చిరంజీవి వాకర్స్ క్లబ్ వ్యవస్థాపకులు, ప్రముఖ సామజిక వేత్త త్యాడ రామకృష్ణారావు (బాలు), వాకర్స్ క్లబ్ పెద్దలు కోట్ల సత్యనారాయణ, వై.నల్లమరాజు, పెనుమత్స అప్పలరాజు, కోట్ల ఈశ్వరరావు, త్యాడ ప్రసాద్ పట్నాయక్, నరేష్, జి.సూర్యప్రకాశరావు, పిన్నింటి లక్ష్మణరావు, రైల్వే రామకృష్ణ, తదితర పెద్దలు పాల్గొన్నారు.

నూతన ఎంపీడీవోగా గొల్లపల్లి పార్వతి

విశాలాంధ్ర-మెంటాడ: మెంటాడ మండలం నూతన ఎంపీడీవోగా గొల్లపల్లి పార్వతి గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈమె సాలూరు మండలంలో పరిపాలనాధికారిగా విధులు విజయవంతంగా నిర్వహించినందున గొల్లపల్లి పార్వతికి పదోన్నతపై మెంటాడ మండలం ఎంపీడీవో గా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసినట్లు పరిపాల యంత్రాంగం తెలియజేశారు. ఈ సందర్భంగా ఎంపీడీవోగా బాధ్యతలు స్వీకరించిన పార్వతి మాట్లాడుతూ మెంటాడ మండలం అభివృద్ధిలో బాధ్యతగా పనిచేసి అభివృద్ధి కార్యక్రమాలను మరింత వేగంగా ముందుకు తీసుకువెళ్లేందుకు కృషి చేస్తానని అన్నారు. అనంతరం స్థానిక ప్రజాప్రతినిధులు సిబ్బంది ఆమెకు పూల గుచ్చాలు అందించి అభినందనలు తెలిపారు.

యూరియా కోసం రైతులు ఆందోళన

విశాలాంధ్ర - దత్తిరాజేరు: మండల పరిధిలో గల పెదకాద గ్రామం లో గురువారం యూరియా కోసం రైతులు ఆందోళన చేపట్టారు. యూరియా వచ్చి 2 రోజులు ఐనా పంపిణీ చెయ్యాలేదంటూ సచివాలయాల ముందు నిరసన తెలియజేసారు. ఆత్మ హత్య చేసుకుంటా మంటూ ఆవేదన వ్యక్తం చేశారు. వ్యవసాయ అధికారిని వివరణ కోరగా యూరియా నిన్న సాయంత్రమే వచ్చిందని అన్నారు.

గ్రామాల్లో స్వస్థ నారీ సశక్తి పరివార్ అభియాన్

విశాలాంధ్ర-కొత్తవలస: మహిళల ఆరోగ్యం పరిరక్షించే దిశగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేపట్టిన స్వస్థ నారీ సశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమం మహిళల పాలిట వరమని కొత్తవలస పిహెచ్సి వైద్యధికారిణి డాక్టర్ సీతల్ వర్మ అన్నారు. కొత్తవలస గ్రామ సచివాలయం1లో గురువారం వైద్య శిబిరం నిర్వహించారు. గ్రామ పెద్దలు గొరపల్లి రాము, గొరపల్లి శివ, గొరపల్లి వెంకట రమణ, సెక్రటరీ గోపీ, సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు. అలాగే తుమ్మికాపల్లి గ్రామంలో వియ్యంపేట పిహెచ్సి వైద్యాధికారి డాక్టర్ గోవలకృష్ణ ఆధ్వర్యంలో స్వస్థ నారీ సశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ విరోతి కొండలరావు, ఉప సర్పంచ్ అద్దూరి సత్యనారాయణ, ఎంపీటీసీ పిల్లా లక్ష్మీ, మాజీ సర్పంచ్ పిల్లా సన్యాసమ్మ, వార్డు మెంబర్ బీసెట్టి ప్రసాద్, స్కూల్ హెచ్.ఎం.అనురాధ, ఐ.సి.డి.ఎస్ సూపర్వైజర్ వెంకటలక్ష్మి, వైద్య సిబ్బంది, అంగన్వాడీ వర్కర్స్, ఆశ వర్కర్స్, మహిళలు పాల్గొన్నారు.

గణితం, సైన్స్ పరికరాలు విజ్ఞానానికి దోహదం

విశాలాంధ్ర-వంగర: గణితం సైన్స్ పరికరాలు విద్యార్థులకు సులభమైన పద్ధతిలో విజ్ఞానాన్ని అందించడానికి ఎంతగానో దోహదపడతాయని మండల విద్యాశాఖ అధికారులు వి.వెంకట్రావు, ఎం.కూర్మినాయుడులు అన్నారు. గురువారం మండల విద్యాశాఖ కార్యాలయంలో ఉన్నత, ప్రాథమికోన్నత పాఠశాలలకు గణిత సైన్స్ పరికరాల కిట్లను ఉపాధ్యాయులకు అందజేశారు. అలాగే మండలంలోని అన్ని పాఠశాలలకు అకాడమిక్ క్యాలెండర్స్ కూడా అందించారు. అనంతరం వారు మాట్లాడుతూ మాట్లాడుతూ ఈ పరికరాల వలన విద్యార్థులక విజ్ఞానం, మేధో సంపత్తికి ఉపయోగపడుతాయన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ సిబ్బంది కిరణ్, తవిటి నాయుడు, సి ఆర్ ఎం టి లు గణపతి, శ్రీను మిగతా సిబ్బంది పాల్గొన్నారు.

మానసిక రుగ్మత గల వారికి ఉచిత న్యాయ సహాయం

విశాలాంధ్ర - విజయనగరం కంటోన్మెంట్: జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎమ్.బబిత ఆదేశాల మేరకు జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జ్ ఏ.కృష్ణ ప్రసాద్ ప్రభుత్వ ఆసుపత్రిలో మానసిక వ్యాధిగ్రస్తులకు ఉచిత న్యాయ సహాయం అనే అంశంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వారు మాట్లాడుతూ న్యాయ సేవల అధికార చట్టంలో సెక్షన్ 12(డి) ప్రకారం మానసిక అనారోగ్యం, ఇతర వైకల్యాలు ఉన్న వ్యక్తులు కేసు దాఖలు చేయడానికి, వాదించడానికి ఉచిత న్యాయ సేవలను పొందేందుకు అర్హులు అన్నారు. లీగల్ సర్వీసెస్ అథారిటీ చట్టంలోని సెక్షన్ 12 (జి) మానసిక ఆసుపత్రి, మానసిక నర్సింగ్ హెూమ్ లో నిర్బంధంలో ఉన్న వారందరికీ హక్కు వర్తిస్తుందన్నారు. జాతీయ న్యాయ సేవ అధికార సంస్థ వారందిస్తున్న పథకం ప్రకారం మానసిక రుగ్మతలు, మానసిక వైకల్యం కలిగిన వ్యక్తులకు ఉచిత న్యాయ సహాయం అందిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఏ.పద్మజ, డిప్యూటీ జిల్లా వైద్య అధికారి డాక్టర్ సూర్య నారాయణ, మానసిక రుగ్మత విభాగం అధిపతి సైకియాట్రిస్ట్ డాక్టర్ కే.శారద, నర్సింగ్ సెక్షన్ సూపరింటెండెంట్ ఏ.కరుణ జ్యోతి, న్యాయవాదులు తాడిరాజు, కే.బాలమురళి, విజయనగరం వన్ టౌన్ ఎస్సై ఎస్.రవి, నర్సింగ్ సిబ్బంది వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మహిళలంతా ఆరోగ్యంగా ఉండాలి: పీఏసీఎస్ అధ్యక్షులు

విశాలాంధ్ర - తెర్లాం: మండలంలో మహిళలందరూ ఆరోగ్యంగా ఉండాలని పిఎసిఎస్ అధ్యక్షులు ఎన్ వెంకటేశ్వరరావు, వైద్యాధికారిణి డాక్టర్ ఆర్.స్వాతి తెలిపారు. తెర్లాం గ్రామంలో స్వస్థనారీ స్వశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అక్టోబరు రెండవ తేదీ వరకు అన్ని ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రాలలో చేపట్టడం జరుగుతుందని వారు తెలిపారు. మహిళలకు 14 రకాల వైద్య సదుపాయాలు గురించి అవగాహన కల్పించారు. ప్రతి మహిళ ఆరోగ్యంగా ఉన్నప్పుడే ఆ ఇల్లు ఆరోగ్యంగా ఉంటుందని ఆయన తెలిపారు. పోషక పదార్థాలు వాటి విలువలు గురించి అవగాహన కల్పించారు. రక్తదానం, మాత శిశు సర్వీసులు, వ్యాధి నిరోధక టీకాలు గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ఇన్చార్జి ఎంపీడీవో డివి రమణ టీడిపి నాయకులు స్థానిక ఎంపిటిసి జి. ఆనంద్, వైస్ సర్పంచ్ మరిపి. శంకర్రావు, వైద్యాధికారి పి వంశీ కృష్ణ, మండల విద్యాశాఖ అధికారి జె త్రినాధ రావు, ఈవో రవికుమార్, అంగన్వాడి సూపర్వైజర్ ఈశ్వరమ్మ, ఏఎన్ఎంలు అన్నామని, వి ప్రభావతి, అంగన్వాడీ కార్యకర్తలు శ్రీదేవి, లక్ష్మి పాల్గొన్నారు.

పౌష్టికాహారంతోనే మహిళలకు ఆరోగ్యం

విశాలాంధ్ర - గంట్యాడ: మహిళలు మంచి పౌష్టికాహారం తీసుకుంటే ఆరోగ్యంగా ఉంటారని గంట్యాడ ఎంపీపీ వీరు బంది హైమావతి తెలిపారు.. రామవరం హైస్కూల్లో స్త్రీ శిశు సంక్షేమ శాఖ మరియు వైద్య శాఖ ఆధ్వర్యంలో 8వ రాష్ట్రీయ పోషణ మాసం, స్వస్త్ నారీ సశక్తి పరివార్ అభియాన్ పథకంలో భాగముగా రామవరం హై స్కూల్లో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ హైమావతి మాట్లాడుతూ మహిళలు ఆరోగ్యంగా ఉంటేనే దేశం బాగుంటుందని అందువలన ప్రతి ఒక్కరూ వైద్య పరీక్షలు తప్పనిసరిగా చేసుకోవాలని అన్నారు. అదేవిధంగా మంచి పౌష్టికాహారం తీసుకోవాలని ఆమె అన్నారు. ఇందుకుగాను ఏర్పాటు చేసిన శిబిరాలు ఎంతో దోహద పడతాయని అందరూ వినియోగించుకోవాలని కోరారు. ఈ సందర్భంగా మెడికల్ ఆఫీసర్ హేమలత మాట్లాడుతూ మహిళలు ఆరోగ్యంగా ఉండాలన్న సంకల్పంతో కేంద్ర ప్రభుత్వం సరికొత్త కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందన్నారు. సిడిపిఓ ఉమాభారతి మాట్లాడుతూ ప్రతి గ్రామంలో పోషణ మాస ఉత్సవాలు సెప్టెంబర్ 17వ తేదీ నుండి అక్టోబర్ 16వ తేదీ వరకు ఈ కార్యక్రమం గ్రామ గ్రామాన జరుగుతుందన్నారు. వైసీపీ నాయకులు ఎస్సీ సెల్ అధ్యక్షులు వీరుబండి జైహింద్ కుమార్ మాట్లాడుతూ వైద్య శాఖ ఆధ్వర్యంలో జరుగుతున్న స్క్రీనింగ్ పరీక్షలను ఉపయోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో సెక్టార్ సూపర్‌వైజర్ అనురాధ, నరవ మదనాపురం సర్పంచులు, మెడికల్ సిబ్బంది, అంగన్వాడి గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

మెడికల్ కాలేజీలపై తప్పుడు ప్రచారం తగదు

విశాలాంధ్ర- వంగర : వై.ఎస్.ఆర్ కాంగ్రెస్ పార్టీ మెడికల్ కాలేజిలపై పైగట్టు కొని తప్పుడు ప్రచారం చేయడం దురదృష్టకరమని రాజాం వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్, రాజాం నియోజకవర్గ టీడీపీ మహిళా అధ్యక్షురాలు లచ్చుభుక్త ధనలక్ష్మి, కృష్ణమూర్తి అన్నారు. గురువారం వారు స్థానిక విలేఖర్లతో మాట్లాడారు. వాస్తవాలను పక్కన పెట్టి రూ.8,500 కోట్ల విలువైన కాలేజీ లను రూ.5,000 కోట్లకు బినామీలకు లీజుకు ఇస్తున్నారని వాస్తవాలను దాచి వక్రీకరణ చేస్తున్నారని విమర్శించారు. కేంద్రం 2019-24 మధ్య కాలంలో కొత్త విధానంలో భాగంగా రాష్ట్రానికి 17 మెడికల్ కాలేజ్‌లు మంజూరు చేసిందని, తాను 17 కాలేజీలుతెచ్చానని చెప్పుకున్న జగన్ ఒక్క దానిని కూడా పూర్తి చెయ్యలేదన్నారు. అన్ని కాలేజ్‌లకు కలిపి రూ.8500 కోట్లు ఖర్చు పెట్టాల్సి ఉండగా కేవలం 17 శాతం మాత్రమే ఖర్చు పెట్టి అర్థాంతరంగా విడచిపెట్టారని వారు వైసీపీపై విమర్శలు గుప్పించారు. ఆగిపోయిన ప్రాజెక్టులను పూర్తి చేసి వినియోగంలోకి తెచ్చేందుకు కూటమి ప్రభుత్వం కసరత్తు చేస్తుందన్నారు. పీపీపీ విధానంలో మెడికల్ కాలేజీల నిర్మాణంపై వైసీపీ అసత్య ఆరోపణలను వారు ఖండించారు.

స్వస్తినారి స్వశక్తి పరివార్ సద్వినియోగం చేసుకోవాలి

విశాలాంధ్ర - చీపురుపల్లి: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన స్వస్తి నారి స్వసక్తి పరివార్ కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని చీపురుపల్లి జడ్పిటిసి వలిరెడ్డి శిరీష, సర్పంచ్ మంగళగిరి సుధారాణి పిలుపునిచ్చారు. గురువారం చీపురుపల్లి పట్టణం కొత్త అగ్రహారం ఆర్య సమాజం ఆవరణలో కర్లాం ప్రైమరీ హెల్త్ సెంటర్ ఐసిడిఎస్ సంయుక్తంగా ఏర్పాటుచేసిన కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన స్వస్తి నారి స్వసక్తి పరివార్ కార్యక్రమం ప్రారంభించారు. ఈ సందర్భంగా గోడ పత్రికను విడుదల చేశారు. అనంతరం కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు ఏర్పాటుచేసిన స్టాల్స్ లను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన స్వస్తి నారి స్వసక్తి పరివార్ కార్యక్రమం మహిళలకు ఎంతో ఉపయోగపడుతుంది అందరూ దీన్ని ఉపయోగించుకోవాల్సిందిగా కోరారు. అలాగే కర్లాం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి అయిన పి ,కృష్ణ మాట్లాడుతూ ఈ కార్యక్రమం ప్రజలకు ఎంతో ఉపయోగపడుతుంది అన్నారు. కార్యక్రమంలో గర్భిణీ స్త్రీలకు తనిఖీలు,అలాగే బీపీ,షుగర్ ఉన్న వారికి కూడా తనిఖీలు క్యాన్సర్ స్క్రీనింగ్లు చేసి వారికి మొత్తానికి మందులు ఉచితం గా పంపిణీ చేయడం జరుగుతుంది అని వివరించారు.ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్వైజర్ మరియు సిబ్బంది, కర్లాం పి.హెచ్.సి. డాక్టర్స్ వైద్య బృందం, సిబ్బంది ఆశా వర్కర్స్, అంగన్వాడీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

యువశ్రీ గ్రంథాలయం అద్భుత విజయం

విశాలాంధ్ర - గరివిడి: మెగా డీఎస్సీ-2025 ఫలితాల్లో యువశ్రీ గ్రంథాలయానికి అద్భుత విజయ పతకం లభించింది. కొత్తవలస మండలం చింతలపాలెం గ్రామానికి చెందిన తిర్రి గౌతమి జోన్-1లో ఆంధ్రప్రదేశ్ ఆదర్శ పాఠశాలల టీజీటీ(ఎల్) ఇంగ్లీష్ పోస్టుల తుది జాబితాలో మొదటి స్థానంలో నిలిచింది. ఈ విషయాన్ని గరివిడి యువశ్రీ గ్రంథాలయ వ్యవస్థాపకుడు సతీష్ రత్నగిరి గురువారం ఒక ప్రకటనలో వెల్లడించారు. రోజువారీ కూలీలైన కనకరాజు, జగదీశ్వరి దంపతుల కలలు నెరవేరాయని సతీష్ అభిప్రాయపడ్డారు.

యువశ్రీ గ్రంథాలయం వాట్సాప్ ద్వారా అందిస్తున్న రోజువారీ మెటీరియల్స్ ప్రారంభ దశ నుంచే ఎంతో తోడ్పడ్డాయని గౌతమి ఆనందం వ్యక్తం చేసినట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా గౌతమిని సతీష్ అభినందించారు. పక్కా ప్రణాళికతో ఏ లక్ష్యాన్నైనా సాధించవచ్చు అని పేర్కొన్నారు. అలాగే సామాజిక మాధ్యమాల ద్వారా యువశ్రీ గ్రంథాలయం ప్రతిరోజూ అందిస్తున్న ఉద్యోగ ప్రకటనలు, పోటీ పరీక్షల మెటీరియల్స్ ను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. గరివిడి పరిసర ప్రాంతాల యువతీ యువకులు గ్రంథాలయంలో లభించే పోటీ పరీక్షల పుస్తకాలను వినియోగించుకుని తమ లక్ష్యసాధనను సులభతరం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

బొడ్డవరలో స్వస్తినారి ససక్త పరివార్ అభియాన్

విశాలాంధ్ర - శృంగవరపుకోట: స్వస్థనారి ససక్త పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా శృంగవరపుకోట మండలంలో బొడ్డవర సచివాలయం వద్ద మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేయడం జరిగింది. మండలంలో గల అన్ని హెల్త్ అండ్ వెల్నెస్ సెంటర్లలో ఈ కార్యక్రమాలు జరుగుతాయి ముఖ్యంగా ఆరోగ్యకరమైన మహిళ బలమైన కుటుంబం ప్రాధాన్యత గా 14 రకాల వైద్య సేవలు అందించడం జరుగుతుంది ముఖ్యంగా తల్లి బిడ్డ వ్యాక్సినేషన్ యుక్త వయసు బాలికలకు ఆరోగ్య సేవలో క్షయ వ్యాధి పరీక్షలు క్యాన్సర్ తొలిదశలో గుర్తించే బ్రెస్ట్ నోటి గర్భాశయ ముఖద్వారా క్యాన్సర్ గుర్తించే తనిఖీలు చేయడం జరుగుతుంది. ఈ కార్యక్రమంలో మురళి రాజు, శ్రీనివాస్, దేవపురపు సన్యాసినాయుడు గ్రామ పెద్దలు వైద్యాధికారులు డాక్టర్, మానస ,సోయల్, సూపర్వైజర్ వెంకటరమణ, ఎం ఎల్ హెచ్ పి లు, వైద్య సిబ్బంది అంగన్వాడి , ఆశ కార్యకర్తలు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎం.వీ.జీ.ఆర్ కళాశాల ఫ్యాకల్టీకి ప్రతిష్టాత్మక సాహిత్య పురస్కారాలు

విశాలాంధ్ర-డెంకాడ: మండల కేంద్రంలోని చింతలవలస వద్ద ఉన్న ఎం.వి.జీ.ఆర్ కళాశాల (అటానమస్), సైన్స్ హ్యుమానిటీస్ విభాగానికి చెందిన ఇద్దరు అధ్యాపకులు డా. కె.వి.రత్న కుమార్, బి.హరి కుమార్ సాహిత్యానికి చేసిన విశేష కృషికి ప్రతిష్టాత్మక జాతీయ స్థాయి సాహిత్య అవార్డులు అందుకున్నారు. డా. కె.వి.రత్న కుమార్‌కు ఆంగ్ల సాహిత్యం - కవిత్వం (ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం) విభాగంలో 2025 రవీంద్ర రత్న పురస్కార్ లభించింది. ది లిటరేచర్ టైమ్స్ అందించే లెగసీ ఆఫ్ లిటరేచర్ అవార్డు 2025ను బి.హరి కుమార్ తన స్ఫూర్తిదాయకమైన పుస్తకం ఇగ్నైట్ ది విరాటియన్ ఇన్ యుకిగాను అందుకున్నారు.

దళిత రణభేరి గోడపత్రిక ఆవిష్కరణ

విశాలాంధ్ర-కొత్తవలస : బహుజనులకు రాజ్యాధికారాన్ని అందివ్వాలనే లక్ష్యంతో ఈనెల 24న విజయవాడలో బీఎస్పీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న దళిత రణభేరి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలంటూ ఆపార్టీ ఎస్.కోట నియోజకవర్గ అధ్యక్షులు దోని అప్పారావు, ఇన్‌చార్జి బోను రమణ, ఎల్.కోట అధ్యక్షులు బూర ప్రసాద్, ప్రచార కార్యదర్శి కెర్రు దేముడు, వెంకటరావుల ఆధ్వర్యంలో గోడపత్రికను ఆవిష్కరించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో నియోజకవర్గంలోని అన్ని స్థానాల్లోనూ తమ అభ్యర్థులు పోటీచేసి గెలుపు దిశగా కృషి చేస్తామన్నారు.

వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి

విశాలాంధ్ర - విజయనగరం: ప్రతి ఒక్కరూ తమ వ్యక్తిగత పరిశుభ్రతను కచ్చితంగా పాటించాల్సిందేనని విజయనగరం నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య అన్నారు. స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా గురువారం పారిశుద్ధ్య కార్మికులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. సర్కిళ్ల వారీగా ఆయా పరిధిలో ఉన్న పట్టణ ఆరోగ్య కేంద్రాలలో ఈ మేరకు పారిశుద్ధ్య కార్మికులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. అలాగే వ్యక్తిగత పరిశుభ్రతపై వైద్యులు పారిశుద్ధ్య సిబ్బందికి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కమిషనర్ పల్లి నల్లనయ్య మాట్లాడుతూ స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమాన్ని అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈనెల 17వ తేదీ నుండి అక్టోబర్ 2 తేదీ వరకు ప్రభుత్వం నిర్దేశించిన కార్యక్రమాలను చేపడుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజారోగ్య సిబ్బంది, పారిశుధ్య పర్యవేక్షకులు పాల్గొన్నారు.

నగర వ్యాప్తంగా ఇంటింటి సర్వే

విశాలాంధ్ర - విజయనగరం: ప్రతి ఆస్తి, పన్ను పరిధిలోకి తీసుకురావాలన్న ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు గురువారం నగర వ్యాప్తంగా ఇంటింటి సర్వే చేపట్టారు. విజయనగరం నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య సూచనలతో సచివాలయ కార్యదర్శులు, నగరపాలక సంస్థ సిబ్బంది, టీమ్‌లుగా ఏర్పడి ఇంటింటికి వెళ్లి ఆస్తి యొక్క వివరాలను కొలతలను సేకరిస్తున్నారు. సచివాలయ అడ్మిన్, ఎమినిటీస్, ప్లానింగ్, ఉమెన్ ప్రొటెక్షన్, వెల్ఫేర్ కార్యదర్శులతో పాటు కార్యాలయ సిబ్బంది ఒకరు మొత్తంగా ఒక టీం గా ఏర్పడి సర్వేలో పాల్గొంటున్నారు. ఈ సందర్భంగా కమిషనర్ పల్లి నల్లనయ్య మాట్లాడుతూ ప్రతి ఆస్తి, పన్ను పరిధిలోకి తీసుకురావాలన్న ఉన్నతాధికారుల ఆదేశాలతో ఇంటింటి సర్వే చేపట్టామన్నారు. అక్టోబర్ 10వ తేదీ లోపుగా సర్వే పూర్తి చేసి నివేదికలు సమర్పించనున్నట్లు చెప్పారు.

గుడ్ టచ్ - బ్యాడ్ టచ్‌పై అవగాహన



విశాలాంధ్ర - గజపతినగరం: గజపతినగరం ప్రభుత్వ న్యాయవాది రమణమ్మ గురువారం కోర్టు న్యాయమూర్తి ఏ.విజయ రాజ్ కుమార్ ఆదేశాల మేరకు గజపతినగరం ఎంపీపీ పాఠశాలలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో పిల్లలు గుడ్ టచ్ బ్యాడ్ టచ్‌పై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. పిల్లలు తమ సమస్యలను ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు దృష్టికి తీసుకురావాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం వివి సన్యాసిరావు, న్యాయవాదులు సాయి శేఖర్, వాసుదేవరావు తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో ఆరోగ్యం: సీడీపీఓ

విశాలాంధ్ర-బొబ్బిలి: కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అంగనవాడి కేంద్రాల ద్వారా చిన్నారులకు, గర్భిణీలకు, బాలింతలకు అందిస్తున్న పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని పోషన్ మహా అవగాహన కార్యక్రమంలో ఐసిడిఎస్ ప్రాజెక్ట్ అధికారిణి జాగాన విజయలక్ష్మి పిలుపునిచ్చారు. గురువారం బొబ్బిలి ప్రాజెక్ట్ పరిధిలో పోషన్ మహా అవగాహన కార్యక్రమంలో సిడిపిఓ జాగాన మాట్లాడుతూ పిల్లల ఊబకాయం వలన కలుగు అనార్థాలు, తినకూడని ఆహారంపై తెలియజేశారు.

వైయస్ జగన్‌ను కలిసిన తలే రాజేష్

విశాలాంధ్ర - రాజాం: రాజాం నియోజకవర్గ ఇన్చార్జ్ డా. తలే రాజేశ్ గురువారం తాడేపల్లిలోని కేంద్ర కార్యాలయంలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తలే రాజేశ్ నియోజకవర్గంలోని తాజా రాజకీయ పరిణామాలను జగన్‌కు వివరించారు. కూటమి రాజకీయాల నేపథ్యంలో కార్యకర్తల్లో ఎలాంటి ఆందోళన అవసరం లేదని, ప్రతి ఒక్కరికీ తన పూర్తి అండగా ఉంటానని జగన్ హామీ ఇచ్చినట్లు ఆయన వెల్లడించారు.

శ్రీవీరబ్రహ్మేంద్ర స్వామి జయంతి

విశాలాంధ్ర-రాజాం : రాజాం టౌన్ సారధి రోడ్‌లో గురువారం శ్రీ కంచి కామాక్షి ఆలయం వద్ద శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామి వారి జయంతి వేడుకలు నిర్వహించారు. రాజాం టౌన్ కన్వీనర్ పాలవలస శ్రీనివాస రావు, ఏఎంసి మాజీ చైర్మెన్ పాలవలస పద్మావతి పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్థానిక కమిటీ సభ్యులు ప్రసాదం అందజేశారు.

కూటమి ప్రభుత్వ తాటాకు చప్పుళ్లకు భయపడకండి..

వైసీపీ నాయకులు కార్యకర్తలకు భరోసా..

విశాలాంధ్ర-చీపురుపల్లి : అధికార కూటమి ప్రభుత్వం చేస్తున్న తాటాకు చప్పుడులకు వైసీపీ శ్రేణులు భయపడనవసరం లేదని చీపురుపల్లి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు పిలుపునిచ్చారు.. గురువారం నాడు మండలంలోని పలు గ్రామాలను పర్యటించి బూత్ స్థాయి కమిటీలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జిల్లా పార్టీ కార్యదర్శి ఇప్పిలి అనంతం, జిల్లా పార్టీ ప్రచార అధ్యక్షులు వలి రెడ్డి శ్రీనివాస నాయుడు, మండల పార్టీ అధ్యక్షులు మీసాల వరహాల నాయుడు తదితరులు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అక్రమంగా బనాయిస్తున్న కేసుల పైన వైసీపీ కార్యకర్తలు ఏ ఒక్కరు భయాందోళనకు గురికాకూడదు అంటూ పిలుపునిచ్చారు , 2029 సార్వత్రిక ఎన్నికల్లో జగన్మోహన్ రెడ్డిని ముఖ్యమంత్రి గా చేసుకోవడమే మన లక్ష్యం గా అందరం కలిసి కట్టుగా ముందుకు వెళ్లాలని నాయకులు కు కార్యకర్తలు కు దిశనిర్దేశం చేసారు . మండల స్థాయి, గ్రామస్థాయి కమిటీల్లో వున్న నాయకులు, కార్యకర్తలు కు 2029 ఎన్నికలో గెలిచాక, జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం లో వీరికే తగిన ప్రాధాన్యత ఉంటుంది అని అన్నారు, అలాగే సోషల్ మీడియా గ్రామ స్థాయి నుంచి పటిష్టంగా పనిచెయ్యాలని కోరారు. కూటమి ప్రభుత్వం లో రైతు సోదరులకు యూరియా కష్టాలను సోషల్ మీడియా ద్వారా ప్రభుత్వానికి తెలియజేయాలని కోరారు. గత జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం లో రైతులకు సంబందించిన యూరియకానీఎరువులుకానీఅన్నికూడా రైతు భరోసా కేంద్రాలలో అందరికి సరిపడాఅందించామని ఇవన్నీ సోషల్ మీడియా ద్వారా ప్రజలకు తెలియజేయాలన్నారు. నియోజకవర్గ పరిధిలో రైతులుఇంతఇబ్బందులుపడుతున్న స్థానిక ఎమ్మెల్యే కళావెంకటరావు నుంచి చంద్రబాబు నాయుడు వరకు కూటమి నాయకులు కు చీమ కుట్టినట్టు లేదు అని ఆరోపించారు. కూటమి నాయకులు అందరూ సూపర్ సిక్స్ సూపర్ సక్సెస్ అని మీటింగులో వాళ్లకు వాళ్లే భజన చేసుకుంటున్నారన్నారు. ప్రజలు అంతా గమనిస్తూ కూటమి ప్రభుత్వానికి భవిష్యత్తులో తగిన బుద్ధి చెబుతారని ఈ సందర్భంగా హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వైస్సార్ పార్టీ నాయకులు పనస అప్పారావు, రఘుమండ త్రినాధ, రేవల్ల సత్తిబాబు, చందక గురునాయుడు, మీసాల ఈశ్వర రావు, తదితరులు పాల్గొన్నారు.

చలో మెడికల్ కాలేజ్ నిరసన విజయవంతం చేయాలి

మాజీ ఎంపీ బెల్లాన

విశాలాంధ్ర-చీపురుపల్లి : ప్రభుత్వ మెడికల్ కళాశాలల చేపట్టిన చలో మెడికల్ కాలేజ్ నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మాజీ ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ కోరారు. గురువారం నాడు స్థానిక వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నిరసన కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్ను ఆయన విడుదల చేశారు. రాష్ట్ర వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధిష్టానం పిలుపుమేరకు ఈనెల 19 నిర్వహిస్తన్న ఈ కార్యక్రమంలో వైసిపి పార్టీ శ్రేణులతో పాటు విద్యార్థి విభాగం నాయకులందరూ పాల్గొని ఆయన పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు ఇప్పిలి అనంతం వలిరెడ్డి శ్రీనివాస నాయుడు మీసాల వరాల నాయుడు యువజన విభాగం నాయకులు బెల్లాన వంశీ, బమ్మిడి కార్తిక్ , చీపురుపల్లి పట్టణ పార్టీ నాయకులు పతివాడ రాజారావు,కోసిరెడ్డి రమణ,ముళ్ళు పైడిరాజు,అప్పికొండ అధిబాబు,మీసాల సాయి,పాండ్రంకి వాను, దబ్బాడ జగదీష్, తదితరులు పాల్గొన్నారు..

రాష్ట్ర స్థాయి జూడో పోటీలకు షికారుగంజి మోడల్ స్కూల్ విద్యార్థులు

విశాలాంధ్ర -దత్తిరాజేరు: షికారుగంజి మోడల్ స్కూల్ విద్యార్థులు రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్ జూడో పోటీలకు అర్హత సాధించారని ప్రిన్సిపాల్ ఎం.ఈశ్వరరావు, వైస్ ప్రిన్సిపాల్ దేవకి వందన గురువారం విలేకరుల సమావేశంలోతెలియజేసారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం క్రీడల కోటాలో 3శాతం ఉద్యోగాలకు అవకాశం కల్పిస్తుందని అన్నారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆరికతోటలో జూడో సెక్రటరీ రత్న కిషోర్, వ్యాయామ సంఘ అధ్యక్షులు నల్ల వెంకటనాయుడు స్కూల్ గేమ్స్ సెక్రటరీలు గోపాల్, విజయలక్ష్మి అండర్ 19 జూడో జిల్లా స్థాయి పోటీలలో అండర్ 14 విభాగంలో ఎడ్ల బంగారు లక్ష్మి, అండర్ 17 విభాగంలో బి ఝాన్సీ, అండర్ 19 విభాగంలో జంబల హారిక,దుర్గాప్రసాద్,డి గిరి లు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక అయ్యారని అన్నారు..విద్యార్థులు ను, వ్యాయామ ఉపాధ్యాయలు రాజేష్ ను, ప్రిన్సిపల్,వైస్ ప్రిన్సిపాల్, ఉపాధ్యాయలు అభినందనలు తెలియజేశారు.

గిరిజన గ్రామాలకు పక్క రహదారి సౌకర్యం కల్పిస్తాము

విజయనగరం పార్లమెంటు సభ్యులు కలిశెట్టి

విశాలాంధ్ర-రామభద్రపురం: 2024 సంవత్సరంలో జరిగిన ఎన్నికలలో ఇచ్చిన హామీలు ఒక్కొక్కటి నెరవేర్చు కుంటూ వస్తున్నానని విజయనగరం పార్లమెంటు సభ్యులు కలిసి అప్పలనాయుడు అన్నారు. గురువారము రావివలస పంచాయతీ ఎను బరువు గ్రామంలో ఇంటింటికి వెళ్లి గిరిజన లు యొక్క సమస్యలపై ఆరా తీశారు. గిరిజనుల యొక్క ఆర్థిక పరిస్థితి మెరుగుపరుస్తామని హామీ ఇచ్చారు. కూటమి ప్రభుత్వాము అధికారం చేపట్టిన తర్వాత మన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటి అమలు చేసుకుంటూ వస్తున్నారని అన్నారు. గిరిజన గ్రామాలకు రహదారులు లేవని తమ దృష్టికి కొంతమంది గిరిజన సంఘాల నాయకులు తీసుకువచ్చారని అన్నారు. ఈ గ్రామాలకు కొద్ది రోజుల్లోనే పక్క రహదారులు నిర్మించే బాధ్యత కూటమి ప్రభుత్వం తీసుకుంటుందని అన్నారు. గ్రామాలలో ఇప్పటికే సిమెంట్ రహదారులు, సిమెంట్ కాలువలు, కంకర రోడ్లు, చెరువులు పనులు చురుగ్గా చేపట్టామని అన్నారు. గిరిజన ప్రాంతాలలో కొండ వాగులలో వచ్చే నీరు భద్రపరుచుకునేందుకు అక్కడక్కడ చెక్ డాము లు నిర్మాణాలు ఉన్నాయని ఇంజనీరింగ్ అధికారులు తమ దృష్టికి తీసుకువచ్చారని అన్నారు. ఎంపీ నిధులతో వాటిని కూడా నిర్మాణం చేపట్టడం జరుగుతుందని అన్నారు. గిరిజనులు ఎవరు ఆందోళన చెందవద్దని అధికారం చేపట్టి 15 నెలలే గడుస్తుంది కాబట్టి ఇంకా చాలా సమయం ఉన్నదని మిగతా పనులన్నీ చేపడతామని అన్నారు. అలాగే చంద్రబాబు నాయుడు ఇచ్చిన హామీలన్నీ ఇప్పటికే నెరవేర్చడం జరిగిందని అన్నారు. ఇటీవల శ్రీ శక్తి పథకంలో భాగంగా మహిళలందరూ కి ఆర్టీసీ బస్సులలో ఉచిత ప్రయాణం సౌకర్యం ప్రభుత్వం కల్పించిందని అన్నారు. రాష్ట్రంలో ఈ సౌకర్యం ద్వారా మహిళలు ఎక్కడికైనా ప్రయాణించవచ్చని అన్నారు. అలాగే గిరిజనులందరూ బాగా చదువుకుంటే మంచి రిజర్వేషన్ ఉందని వాటి ద్వారా మంచి మంచి ఉద్యోగాలు పొందవచ్చని అన్నారు. ఈయన వెంట మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు కరణం విజయభాస్కర్, కొండ కేంగువ మాజీ సర్పంచ్ తెలుగుదేశం పార్టీ మండల ఉపాధ్యక్షులు సిరిపురపు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

జిందాల్ కి భూములు ఇచ్చి మేము మోసపోయాం...

మాభూమి- మాకే ఇవ్వాలి ఇచ్చేవరకు ఆందోళన నిర్వహిస్తాం

విశాలాంధ్ర-శృంగవరపుకోట : జిందాల్ కంపెనీ పేరుతో భూములు తీసుకొని కంపెనీ కట్టకుండా సేకరించిన భూమిని తెగనమ్మడా నికి సిద్ధపడ్డ నేపథ్యంలో పేదల నుంచి సేకరించిన భూములను తిరిగి నిర్వాసితులకు ఇచ్చియాలని ఏపీ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు చల్లా జగన్ డిమాండ్ చేశారు. గురువారం బొడ్డవరలోని నిర్వాసితులు మాట్లాడుతూ భూములు ఇచ్చిన నిర్వాసితులకు తాటిపూడి రైతాంగానికి నష్టం చేసే జీవో నంబరు 14 వెంటనే రద్దు చేయాలని కోరారు. కంపెనీ యాజమాన్యం ఈరోజు కూడా కొంతమంది పెద్దలను ఇంజనీరింగ్ జిందాల్ స్థలంలోకి తీసుకొచ్చి సర్వే నిర్వహిస్తున్నారు. పారిశ్రామిక అశాంతితో ఉన్న ఈ భూములను ఇతర పెద్దలు ఎవరు కొని మోసపోవద్దని వారు తెలిపారు, ఇప్పటికే భూములు ఇచ్చిన నిర్వాసితులు సర్వం కోల్పోయి రోడ్డుమీద ఉన్నారన్నారు . బొడ్డవర- తాటిపూడి రోడ్డును ఆనుకొని ఉన్న విలువైన భూములను జిందాల్ పరిశ్రమ పేరుతో దళిత,గిరిజనులను మాయ చేసి సేకరించిన భూములను ఇండస్ట్రియల్ రియల్ ఎస్టేట్ చేసుకునేందుకు జీవో నంబరు 14 తెచ్చి , ప్లాట్లుగా వేసి అమ్ముకునేందుకు సిద్ధపడటం చూస్తుంటే ఉద్దేశపూర్వకంగా జిందాల్ యాజమాన్యం నిరుపేదల నుంచి భూమి లాగేసుకుందని, కంపెనీ కట్టి ఆ కంపెనీలో మీకు మంచి భవిష్యత్ కల్పించి భూమి విలువకు సరి సమానమైన షేర్లు ఇస్తామని నమ్మించడమే కాకుండా పది రూపాయలు విలువ గల షేరుకు మూడు సంవత్సరాల్లో ?100 అవుతుందని రాతపూర్వకంగా రాసిచ్చి ఇప్పుడేమో అవేవీ పట్టించుకోకుండా ప్రభుత్వాలను పెద్దలను మచ్చిక చేసుకుని నిరాధారమైన పేదలను నట్టేట ముంచడం తగదన్నారు జిందాల్ భూములు చుట్టూ ఎన్నో అక్రమాలు జరిగాయి అన్న కంపెనీ నిర్మాణం చేపట్టలేదు కాబట్టి నిర్వాసితుల భూమి వారికి వెంటనే అప్పగించాలని జగన్ డిమాండ్ చేశారు , పేదల భూమి పేదలకు ఇచ్చేవరకు దీర్ఘ కాలిక పోరాటానికి సిద్ధపడతామని వారు స్పష్టం చేశారు.

రాష్ట్రంలో మెడికల్ కళాశాలలు ఏర్పాటును పి.పి.పి పేరుతో ప్రైవేట్ వారికి అప్పగించడం తగదు

విశాలాంధ్ర-వంగర: కూటమి ప్రభుత్వం చేతులు దులుపుకోవడం బాధ్యతారాహిత్యమైన చర్య ని జిల్లా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి, ఎంపీపీ యూ.సురేష్ ముఖర్జీ గురువారం ఒక ప్రకటనలో తెలియ చేశారు. ఈ ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈ నెల 19న వైసీపీ అధినేత,మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఆదేశాలతో నిరంతరం ఒక పేద ప్రజల కోసం శ్రమిస్తున్న రాజాం అసెంబ్లీ నియోజకవర్గ ఇంచార్జ్ డా. రాజేష్ తలే, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ ఆధ్వర్యంలో చలో మెడికల్ కళాశాలలకార్యక్రమాన్ని చేపట్టడం జరిగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు,కార్యకర్తలు,పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలనీ ఆయన పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా జిల్లావైఎస్ఆర్ కాంగ్రెస్పార్టీఅధికారప్రతినిధి,ఎంపీపీయూ.సురేష్ ముఖర్జీ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ మెడికల్ కళాశాలల పైచేస్తున్నఅనాలోచిత,అసమంజస నిర్ణయాన్ని తీవ్రంగా వ్యతిరేకించారు. ఎన్ డీ ఏ కూటమి ప్రభుత్వ నిర్ణయం వల్ల పేదరికం,కరువుతో తీవ్ర దుర్భిక్షంతో సతమవుతున్న రాజాం అసెంబ్లీ నియోజకవర్గం పరిసర ప్రాంతాల ప్రజానీకానికి తీవ్ర విఘాతమవుతుందన్నారు.కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలనీ ఆయన పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా జిల్లావైఎస్ఆర్ కాంగ్రెస్పార్టీఅధికాంం ప్రతినిధి,ఎంపీపీయూ.సురేష్ ముఖర్జీ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ మెడికల్ కళాశాలలపై చేస్తున్న అనాలోచిత, అసమంజస నిర్ణయాన్ని తీవ్రంగా వ్యతిరేకించారు. ఎన్ డీ ఏ కూటమి ప్రభుత్వ నిర్ణయం వల్ల పేదరికం,కరువుతో తీవ్ర దుర్భిక్షంతో సతమవుతున్న రాజాం అసెంబ్లీ నియోజకవర్గం పరిసర ప్రాంతాల ప్రజానీకానికి తీవ్ర విఘాతమవుతుందన్నారు. వైఎస్ జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం పేద ప్రజల ఆరోగ్యం, వైద్య విద్యార్థుల ప్రయోజనాల దృష్ట్యా ప్రభుత్వమే బాధ్యతగా తీసుకొని మెడికల్ కాలేజీల ఏర్పాటు, . నిర్మాణం చేపట్టగా ఈ కూటమి ప్రభుత్వం సామాన్య ప్రజల శ్రేయస్సును తుంగలో తొక్కి వ్యాపార ధోరణిలో ఆలోచిస్తుందని విమర్శించారు. ఒక్కో మెడికల్ కళాశాల నిర్మాణం 500కోట్లతో చేపట్టవచ్చని,ప్రభుత్వం సంక్షేమ పథకాల విజయోత్సవ సభల పేరిట చేసే ఖర్చుతో పోలిస్తే ప్రభుత్వానికి భారం ఏమీ కాదన్నారు.తమ ప్రభుత్వ హయాంలో పేదలకు ఉచిత వైద్యం అందించాలనే ధ్రుడసంకల్పంతో ఏర్పాటు చేసిన మెడికల్ కాలేజీలను ప్రవేటీకరించాలనే కూటమి ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టడంజరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో యువజన విభాగం నాయకులు,విద్యార్థి విభాగంనాయకులు,అనుబంధ విభాగాలు నాయకులు, కార్యకర్తలు,అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలనీ జిల్లా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి, ఎంపీపీ యూ.సురేష్ ముఖర్జీ కోరారు.

సబ్ జైలు వద్ద పెట్రోల్ బంకు పెట్టొద్దు

ఆర్డీవో కు వినతి

విశాలాంధ్ర-బొబ్బిలి: స్థానిక పట్టణం ప్రభుత్వాసుపత్రి రోడ్డు సబ్ జైలు ప్రాంగణంలో ప్రభుత్వం జైలు శాఖ ఆధ్వర్యంలో ఐఓసీ పెట్రోల్ బంక్ ఏర్పాటు చేయడానికి అధికారులు ప్రతిపాదన పంపిస్తున్నారని దీంతో ప్రజల ప్రాణాలకు ముప్పు వాటిల్లుతుందని ఆయా ప్రాంతాల ప్రజలు ఆందోళన చెందుతున్నారని కౌన్సిల్ సభ్యులు మరిపి తిరుపతిరావు, టీవీ భాస్కరరావు, ఎస్ నారాయణ రావు తదితరుల ఆధ్వర్యంలో గురువారం రెవిన్యూ డివిజనల్ అధికారి కార్యాలయంలో రెవిన్యూ డివిజనల్ అధికారి రామ్మోహన్ రావు కు వినతి పత్రం అందజేశారు.

ప్రజా సమస్యల పరిష్కారమే కూటమి లక్ష్యం..

టిడిపి కార్యదర్శి కిమిడి మల్లిక నాయుడు

విశాలాంధ్ర -చీపురుపల్లి: ప్రజా సమస్యలను తెలుసు కుని పరిష్కరిం చడంలో కూటమి ప్రభుత్వం ముందంజలో ఉందని తెలుగుదేశం పార్టీ కార్యదర్శి కిమిడి మల్లిక నాయుడు అన్నారు. గురువారం నాడు చీపురుపల్లి మండలంలోని పలు గ్రామాలను పర్యటించి తెలుగుదేశం పార్టీ శ్రేణులను పార్టీ కార్యకర్తలను ఆయన పరామర్శించారు. కర్లాం గ్రామానికి చెందిన పిఎసిఎస్ చైర్మన్ కెల్ల రామారావు ఇటీవల సత్రసికిత్సలు చేసుకొని ఇంటివద్ద విశ్రాంతి తీసుకుంటున్న నేపథ్యంలో తెలుగుదేశం పార్టీ నాయకులు ఆయనను పరామర్శించారు. అదేవిధంగా రావివలస గ్రామానికి చెందిన పనస రమణ ప్రమాదవశాత్తు గాయపడటంతో తెలుగుదేశం పార్టీ నాయకులు ఆయనను కూడా పరామర్శించి ఆపదలో ఆదుకుంటామని హామీ ఇచ్చారు. పురేయవలస గ్రామానికి చెందిన వార్డ్ మెంబర్ కోరాడ నారాయణరావునీ కూడా తెలుగుదేశం పార్టీ శ్రేణులు గురువారం నాడు పరామర్శించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు రౌతు కాము నాయుడు నాయుడు గవిడి నాగరాజు, కర్లాం , పురేయవలస, రావివలస , గ్రామాలకు చెందిన తెలుగుదేశం పార్టీ నాయకులు శ్రేణులు తదితరులు పాల్గొన్నారు.

ఓజోన్ పొర రక్షణ మనందరి బాధ్యత

విశాలాంధ్ర-భోగాపురం: మండలం కవులువాడలోని ఉన్నత పాఠశాలలో విద్యార్థులతో ఓజోన్ దినోత్సవం సందర్భంగా జీఎంఆర్ సంస్థ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు చెట్ల పెంపకం, పరిసరాల పరిశుభ్రత ద్వారా ఓజోన్ పొర రక్షణపై నినాదాలు చేస్తూ అవగాహన కల్పించారు. జీఎంఆర్ సంస్థ కోఆర్డినేటర్ జనార్ధన్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ చెట్లు నాటి సంరక్షిస్తే పర్యావరణ సమతుల్యత కాపాడబడుతుంది. ఓజోన్ పొర రక్షించుకోవాదం మనందరి బాధ్యత అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

కలెక్టర్ ను కలసిన కర్రోతు సత్యనారాయణ

విశాలాంధ్ర-భోగాపురం : విజయనగరం జిల్లా నూతన కలెక్టర్ ఎస్.రామసుందర్ రెడ్డి ని భోగాపురం మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు సత్యనారాయణ ఆధ్వర్యంలో టిడిపి నాయకులు గురువారం మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్‌కు స్వాగతం పలుకుతూ సాలువ కప్పి ఘనంగా సత్కరించారు. జిల్లా అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారం దిశగా కలెక్టర్ సానుకూలంగా చర్యలు తీసుకుంటారని సత్యనారాయణ నమ్మకం వ్యక్తం చేశారు.

మనడబ్బులు-మనలెక్కలుపై

డ్వాక్రా మహిళలకు అవగాహన

విశాలాంధ్ర-జామి: మండలంలోని లొట్ల పల్లి పంచాయతీలో అలమండల సంత వద్ద డ్వాక్రా మహిళలకు వెలుగు సిబ్బంది మనడబ్బులు-మనలెక్కలు కార్యక్రమంపై అవగాహనా కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. మహిళలకు వెలుగు ఎపిఎం అప్పలనాయుడు, సిసిలు కృష్ణ, చినబాబు, అప్పలనాయుడులు అవగాహన కల్పించారు. గ్రామీణ పేదరిక నిర్మూలనలో భాగంగా పైలెట్ గ్రామమైన లొట్లపల్లిలో ఈకార్యక్రమాన్ని నిర్వహిం చడం జరిగిందన్నారు. మహిళలతో సమావేశానికి ముందుగా గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. మహిళలకు డిజిటల్ లావాదేవీలపై అవగాహన కల్పించడమే కాకుండా మనడబ్బులు-మనలెక్కలు యాప్‌ను పరిచం చేసి వారి ఫోన్‌లలో డౌన్‌లోడ్ చేయించారు. ఉమెన్‌పవర్ యాప్ ద్వారా పొదుపు సంఘం సభ్యులు తాము తీసుకున్న రుణాలు, చెల్లింపుల వివరాలను ఎప్పటికప్పుడు తెలుసుకోవచ్చున్నారు. ఈకార్యక్రమంలో వివోఏ సంతోషి తదితరులు హాజరయ్యారు.

అరుణాచలేశ్వర ఆలయంలో తిష్ట వేసిన పాము..

విశాలాంధ్ర-చీపురుపల్లి : చీపురుపల్లి మండలం కర్లం రమణ మహర్షి ఆశ్రమంలో ఉన్న అరుణా చలేస్వరుని ఆలయంలో గురువారం నాడు ఓ పాము తిష్ట వేసింది. దాదాపు గంట సమయం వరకు గర్భాలయంలోని చక్కర్లు కొట్టింది. నిత్య పూజల్లో భాగంగా ఆలయ పూజారి నేతేటి బాలసుబ్రమణ్య శర్మ గర్భాలయ తలుపులు తెరవగా అరుణాచలేస్వరుని విగ్రహం వద్ద ఉండడాన్ని గుర్తించారు. పూజలకు వచ్చిన భక్తులు పాము బయటకు వచ్చేవరకు వేచి చూసారు. ఆ తరువాత తానంతట తానే బయటకు రావడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

లొట్లపల్లి రేషన్ డీలర్ పై 6 ఏ కేసు నమోదు

విశాలాంధ్ర-జామి: మండలంలోని లొట్లపల్లి గ్రామంలో ఉన్న రేషన్ డిపోలో గురువారం పౌరసరఫరాల శాఖ డిటి మూర్తి ఆధ్వర్యంలో ఆకస్మికంగా తనిఖీలను నిర్వహించారు. ఈ తనిఖీలలో 18 25 కేజీల బియ్యం, 13 ప్యాకెట్ల పంచదార, ఐసిడిఎస్ కు సంబంధించిన బియ్యం 25 కిలోలు తక్కువగా ఉన్నట్లు గుర్తించారు. ఇన్చార్జి రేషన్ డీలర్ గా పని చేస్తున్న ఐ లక్ష్మీపై 6ఏ కేసు నమోదు చేశారు. ఈ తనిఖీ లలో చింతాడ విఆర్ఓ ఉదయ్, లొట్లపల్లి వీఆర్వో లావణ్య తదితరులు పాల్గొన్నారు..

సంపాదకీయం

ఆ విధానమే సరిలేదు!

భారతదేశంలో ప్రభుత్వ వ్యవసాయ విధానం అస్తవ్యస్తంగా ఉందని చెప్పడానికి యూరియా కొరత ఒక ఉదాహరణ. ఆంధ్రప్రదేశ్, తెలంగాణతోపాటు ఎన్నో రాష్ట్రాల్లో ప్రస్తుతం యూరియా కొరత వేధిస్తోంది. ముఖ్యంగా ఏపీలో రైతుల ఆందోళనలు మిన్నంటాయి. అవసరానికి సరిపడా యూరియా దొరక్కపోగా, బ్లాక్‌మార్కెట్ పెద్ద తలనొప్పి వ్యవహారంగా మారిపోయింది. శ్రీకాకుళం జిల్లా కోటబొమ్మాళిలోని ఒక డిపోలో 1500 మంది రైతులు యూరియా కోసం క్యూలో నిల్చొనగా, కేవలం 350 మందికి మాత్రమే యూరియా కట్టలిచ్చి అధికారులు చేతులు దులుపుకున్నారు. కొరత ఏ స్థాయిలో ఉందో అర్థమవుతున్నది. యూరియా అవసరాలు వ్యవసాయ సీజన్ (ఖరీఫ్/రబీ), సాగు విస్తీర్ణం, వర్షపాతం వంటి అనేక అంశాలపై ఆధారపడి ఉంటాయనేది త్రోసిపుచ్చలేం. ముఖ్యంగా ఖరీఫ్ సీజన్‌లో పంటలకు యూరియా చాలా అవసరం. రాష్ట్రంలో సుమారు 40% యూరియా కొరత ఉందని వ్యవసాయ అధికారులే చెపుతున్నారు. కేంద్ర ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్‌కు అదనంగా యూరియాను కేటాయిస్తున్నట్లు ఈ మధ్యనే ప్రకటించింది. 24,894 మెట్రిక్ టన్నుల యూరియాను రాష్ట్రానికి కేటాయించారు. ఇది విశాఖపట్నం పోర్టుకు చేరినట్లు ధృవీకరించారు. వ్యవసాయ మంత్రిత్వ శాఖ నివేదికల ప్రకారం, రాష్ట్రంలో సహకార సంఘాలు, రైతు సేవా కేంద్రాలు, ప్రైవేట్ డీలర్ల వద్ద 82,054 మెట్రిక్ టన్నుల యూరియా నిల్వలు ఉన్నాయి. అదనంగా, వివిధ పోర్టులు, తయారీ కంపెనీల నుంచి మరో 29,236 మెట్రిక్ టన్నులు రవాణాలో ఉన్నాయి. మొత్తం మీద, సెప్టెంబర్ చివరి నాటికి 1,06,412 మెట్రిక్ టన్నుల యూరియా రాష్ట్రానికి చేరవచ్చని అంచనా. జిల్లా స్థాయి అవసరాలు మారుతూ వస్తున్నాయి. ఉదాహరణకు, గుంటూరు జిల్లాకు అవసరమైన 24,000 మెట్రిక్ టన్నులకు బదులుగా 26,000 మెట్రిక్ టన్నుల యూరియా సరఫరా అయింది. భారీ వర్షాలతో కొన్ని ప్రాంతాల్లో యూరియా కొట్టుకుపోయిందన్న వాదనలో పసలేదు. ప్రభుత్వం ఎరువుల సరఫరాను క్రమం తప్పకుండా పర్యవేక్షిస్తున్నట్లు చెప్పుకుంటున్నప్పటికీ, అధికారుల వాస్తవ పనితీరు ఆ స్థాయిలో కనపడటం లేదు. ఇవన్నీ ఒకెత్తయితే, యూరియా అధిక వినియోగాన్ని తగ్గించడానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు యూరియా వినియోగాన్ని తగ్గించిన రైతులకు రూ.800 ప్రోత్సాహకాన్ని ప్రకటించారు. ఈ ప్రోత్సాహకాల గొడవ వచ్చే సీజన్‌కు సంబంధించినది. సీఎం ప్రకటన ఇప్పటికిప్పుడు రైతన్న ఎదుర్కొంటున్న కొరతను తీర్చలేదు.

యూరియా వాడకం వల్ల నష్టాలున్నాయని తెలియనిదికాదు. ప్రత్యామ్నాయం చూపడంలో ప్రభుత్వ వైఫల్యం కాదనలేని సత్యం. యూరియా అధికంగా వాడటం వల్ల నేలలోని నత్రజని శాతం పెరుగుతుంది. ఇది నేలలోని సారం విలువను మార్చి, నేలను కలుషితం చేస్తుంది. నేలలోని అదనపు యూరియా వర్షపు నీటితో కలిసి నదులు, చెరువులు, భూగర్భ జలాల్లోకి చేరుతుంది. దీనివల్ల నీటిలో విషపూరిత లవణాలు విపరీతంగా పెరిగి, చేపలు, ఇతర జలచరాలు చనిపోతాయి. యూరియాలోని నైట్రోజన్ వాతావరణంలోకి అమ్మోనియా వాయువుగా విడుదలవుతుంది. ఇది గాలి కాలుష్యానికి కారణమవుతుంది. పంట మొక్కలు ఆకులు, కాండం ఎక్కువగా పెరిగి, పూత, కాత సరిగా రాక... పంట దిగుబడితో పాటు, నాణ్యత కూడా తగ్గుతుంది. యూరియాలోని రసాయనాలు నేలను సహజసిద్ధంగా సారవంతం చేసే సూక్ష్మజీవులను, వానపాములను నాశనం చేస్తాయి. యూరియా అధికంగా వాడిన పంటలను తినడం వల్ల మనుషుల్లో నైట్రేట్ శాతం పెరిగి ఆరోగ్య సమస్యలు తలెత్తవచ్చు. ఈ నష్టాలను తగ్గించడానికి, రైతులు యూరియా వాడకాన్ని తగ్గించి, సేంద్రీయ ఎరువులు, జీవ ఎరువులు, సమగ్ర పోషక యాజమాన్యం పద్ధతులను పాటించడం మంచిది. అంతవరకు బాగానే ఉంది. కాకపోతే ఈ సూచనలన్నీ ప్రస్తుత ఖరీఫ్, రబీ సీజన్‌లకు సాధ్యమయ్యే పనేనా?

దేశంలో యూరియా కొరతకు ప్రధాన కారణం...ఈ రసాయనాన్ని ఇతర అవసరాలకు విచ్చలవిడిగా వాడుతుండటమే. పారిశ్రామిక ఉపయోగార్థం యూరియాను ప్లాస్టిక్, అడ్హెసివ్స్ (జిగురు), ఫార్మాల్డిహైడ్ రెసిన్‌ల తయారీలో ఉపయోగిస్తారు. ఇవి ఫర్నిచర్, ప్యానెల్స్, ఇతర నిర్మాణ సామగ్రిలో వాడతారు. డీజిల్ వాహనాల నుంచి వచ్చే కాలుష్యాన్ని తగ్గించడానికి యూరియాను డీజిల్ ఎగ్జాస్ట్ ఫ్లూయిడ్‌గా ఉపయోగిస్తారు. ఇది నైట్రోజన్ ఆక్సైడ్లను ప్రమాదకరం కాని నత్రజని, నీరుగా మారుస్తుంది. పేపర్ పరిశ్రమలో కొన్ని రకాల పేపర్లను తయారు చేయడానికి యూరియాను వాడతారు. వైద్య, సౌందర్య సాధనాల ఉపయోగార్థం యూరియాను కొన్ని రకాల చర్మ సంరక్షణ క్రీములు, లోషన్లు, మాయిశ్చరైజర్లలో ఉపయోగిస్తారు. ఇది చర్మాన్ని తేమగా ఉంచడంలో సహాయపడుతుంది. కొన్ని రకాల మందుల తయారీలో కూడా దీనిని ఉపయోగిస్తారు. విమానాశ్రయాలలో రన్‌వేల మీద పేరుకుపోయిన మంచును తొలగించడానికి డి-ఐసింగ్ ఏజెంట్‌గా యూరియాను వాడుతారు. అలాగే, పశువులకు ఇచ్చే దాణాలో ప్రోటీన్ శాతాన్ని పెంచడానికి తక్కువ మొత్తంలో యూరియాను కలుపుతారు. ఇన్ని రకాల అవసరాల నేపథ్యంలో యూరియా కొరత సహజమేనని అనలేం. ఇవన్నీ తెలిసిన ప్రభుత్వం ఏం చేస్తోంది? నత్రజని అవసరం లేకుండా పంటలను పండించడం సాధ్యమా? జీవన ఎరువులైన రైజోబియం, అజటోబాక్టర్, అజస్పైరిల్లమ్, నీటి ఆకుపచ్చ నాచు వంటి వాటిని వినియోగించడం ద్వారా భూమి సహజ స్వభావం దెబ్బతినకుండా నత్రజని శాతాన్ని పెంచవచ్చు. వీటి వల్ల దీర్ఘకాలిక ప్రయోజనాలూ ఉంటాయి. వాటి సరఫరాకు, లేదా స్థానికంగానే వాటి తయారీకి ప్రభుత్వం ఏ చర్యలు తీసుకుంటున్నది? ఎరువుల సబ్సిడీని తగ్గించేందుకు 2013 జూన్‌లో మోదీ సర్కారు 'పీఎం-ప్రణామ్' పేరుతో ఒక పథకాన్ని తీసుకువచ్చింది. ఎరువుల సబ్సిడీని రూ.20 వేల కోట్లు తగ్గించుకోవాలన్నది కేంద్ర లక్ష్యం. మూడేళ్లపాటు అమలులో ఉండే ఈ పథకం కింద గ్రాంట్ పొందాలని రాష్ట్ర ప్రభుత్వం చూస్తోంది. ఈ గ్రాంట్‌లో కొంత మొత్తాన్నయినా రైతుల ఖాతాల్లోకి జమచేస్తే ప్రస్తుత ఆందోళన తగ్గుతుందని ప్రభుత్వం భావించవచ్చు. కానీ దానిక్కూడా విధివిధానాలేవీ లేవు. ఈ-క్రాప్ అనేది ఒక ఫార్సుగా మారింది. వెబ్‌ల్యాండ్ ఆధారంగా ఈ-క్రాప్ అనుసంధానమవుతుందని చెపుతున్నా, పంటలు వేసిన తర్వాత అవి నమోదవుతున్నాయి. అలాంటప్పుడు ఈ-క్రాప్‌కు ప్రాతిపదిక ఏముంటుంది? పైగా లక్షల మంది కౌలురైతులు రాష్ట్రంలో ఉన్నారు. చంద్రబాబు చెపుతున్న నగదు ప్రోత్సాహకం వారికి అందుతుందా? యూరియాను తగ్గిస్తే రూ.800 ఇస్తామన్నప్పుడు, డీఏపీ, ఎంఓపీ, ఎస్ఎస్‌పీ, ఎన్‌పీకే (కాంప్లెక్స్) వంటి ఇతర ఎరువుల వాడకం తగ్గింపుపై ప్రోత్సాహకాలుండవా? ఇదంతా చూస్తే, యూరియా కొరతను తీర్చకుండా సర్కారు వేసే కప్పదాటు వ్యవహారంలా గోచరిస్తోంది. ఏదేమైనప్పటికీ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వ్యవసాయ విధానాలే అసమంజసంగా ఉన్నాయనేది విస్పష్టం. వాడకాలు, ప్రోత్సాహకాల సంగతి పక్కనబెట్టి, ఈ ఏడాది ఎరువుల కొరత లేకుండా ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకోవాలి.

పేదలకు అన్యాయమే

ఇది చాలా అన్యాయం. నేను సహించను. రేపే ప్రజల్లోకి వెడతా. ఈ దుర్మార్గాన్ని సహించను. ఏంటి బావ దుర్మార్గం సహించను అంటున్నావ్. నీకు తెలియదా రోజూ ఉదయమే పేపరు చదువుతావు కదా. ఒక పక్క కమ్యూనిస్టులు, అభ్యుదయవాదులు, మేధావులు గగ్గోలు పెడుతుంటే ఏమీ ఎరగనట్లు నిదానంగా ఏమిటి అంటావేమిటి. అది సరే విషయం ఏంటో చెప్పు. చెప్పడానికేముంది నా బోటి పేదల పిల్లలు డాక్టర్లు కాకూడదనేగా నేటి ప్రభుత్వ పన్నాగం. గత ప్రభుత్వం ఏర్పాటు చేసిన మెడికల్ కాలేజీలు ప్రైవేటుపరం చేస్తాడంట. ఉన్నవారి పిల్లలే వైద్య కోర్సు చదవాలంట. ఒక పక్క సంపద సృష్టిస్తానని కబుర్లు చెప్పి ప్రభుత్వ కాలేజీలు ఉన్నవారి పరంచేసి సంపద సృష్టిస్తారా. ఏమిటి అన్యాయం. ఇది నీకు కొత్తగా అన్పిస్తోందా. చంద్రబాబు ఆలోచన ఉన్నవారికి ఉపయోగపడి వారి సహాయంతో గద్దెనెక్కడమేనని అనుకుంటున్నారు. ఈ రోజు మెడికల్ కళాశాలలు ప్రైవేటుపరం చేయడం నాకు కొత్తగా అన్పించడంలేదు. అసలు సంపద సృష్టించి ప్రభుత్వం నడిపించే వాడయితే సంపద ఉన్నవారికి లబ్ధి చేకూర్చే పనులు చేయరు. ప్రభుత్వానికి ఆదాయం కావాలంటే పరిశ్రమాధిపతుల నుంచి వసూలు చేయవచ్చుకదా. వారిపై పన్నులు పెంచడం, చందాల ద్వారా వసూలు చేయకుండా ప్రభుత్వ మెడికల్ కళాశాలలు వారికి దారాదత్తం చేయడం సమంజసమేనా? గద్దె నెక్కడానికి అలవికాని సూపర్ సిక్సు లాంటి వాగ్దానాలు చేసి గద్దెనెక్కిన తరువాత ప్రభుత్వ ఖజానా ఖాళీ అయిందని చేతులెత్తేస్తే ఎలా? సంక్షేమ పథకాలు నిలిపివేసి సంపద సృష్టించి తన అనుభవం, తెలివితేటలు నిరూపించవచ్చు గదా.

కూటమి ప్రభుత్వం ఏర్పాటయిన దగ్గర నుంచి ప్రతిరోజు జగన్ దుర్మార్గుడని ఖజానా ఖాళీచేసి పోయాడని దుర్మార్గ పాలనలో తన వారికి దోచి పెట్టాడని తిట్టడంతో చేతులు దులుపుకుంటే ప్రజలు మెచ్చుకోరు. జగన్ అనేక తప్పులు చేసి ఉండవచ్చు. ఆ తప్పులు మీరు చేయకుండా ప్రజలు మెచ్చే ఆలోచనతో పాలన చేయవచ్చుకదా. జగన్ నవరత్నాలని పేదలను ఆకర్షిస్తే చంద్రబాబు సూపరు సిక్సు పూర్తిగా అమలు చేయకపోగా పన్నులు పెంచడంలో నిమగ్నమయ్యారు. కరెంటు చార్జీలు, బస్సు చార్జీలు లాంటివి పెంచి మధ్య తరగతి వారి నెత్తికి పెంచారు. పన్నులు పెంచకుండా అప్పులు పెంచకుండా మంచి పాలనచేస్తే బాబు తెలివితేటల గమనించి ప్రజలు హర్షం వ్యక్తం చేసి కూటమి ప్రభుత్వానికి జేజేలు పలుకుతారు.

స్త్రీలకు ఉచిత బస్సు ప్రయాణం అన్నారు. అన్నట్లుగానే ఆగస్టు 15 న ప్రారంభించారు. కాని ఒకపక్క అప్పులు పెంచుతూ ఉచిత బస్సు పథకం అమలుపై కొందరు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. రెండు నెలల తరువాత ఆ పథకం వల్ల వచ్చిన కోట్ల నష్టం వంకతో ఆర్టీసీని కూడా ప్రైవేటు పరం చేస్తాడనే అనుమానం కొందరిలో ఉంది. ప్రత్యక్ష పన్నులు కాకుండా పరోక్ష పన్నులు పెంచడంలో బాబు అగ్రగణ్యుడని కొందరు వ్యాఖ్యానించినా కరెంటు చార్జీలు పెంచడం ద్వారా ప్రత్యక్షంగానే పెంచారు. ఆదాయ పన్ను శాఖ ద్వారా వేల కోట్లు సంపాదించే వారి జాబితా సంపాదించి వారికి పన్నులు పెంచి సంక్షేమ కార్యక్రమాలకు ఖర్చు పెట్టవచ్చు. కాని ఆ పని ప్రధాని మోదీగాని, చంద్రబాబులాంటి వారుగానీ చెయ్యరు.

ఎందుకంటే ఎన్నికలకు ఫండు వారి నుంచే తీసుకుంటారు గనుక. జగన్ ఎత్తివేసిన అన్నదాన కార్యక్రమాలు బాబు మరల మొదలుపెట్టారు. పేదలకు అందే దానికంటే నడిపేవారి చేతివాటం ఎక్కువయిందనే వ్యాఖ్యానాలు వినిపిస్తున్నాయి. అమరావతినే రాజధానిగా ఎంచుకుని అక్కడ పనుల్లో నిమగ్నమవటం ఎవరికి లబ్ధి చేకూరుతుందో తెలిసిన విషయమే. ప్రతిది ప్రభుత్వం వల్ల కాదని ప్రైవేటుపరం చేయడం ప్రజలకు తీరని ద్రోహం చేసినట్లుగానే భావించాలి.

సెల్: 9885569394

ఉత్పత్తి పెరుగుతున్నా... సంక్షోభంలోనే రైతన్న

ఆర్ సూర్యమూర్తి

భారతదేశ వ్యవసాయ లక్ష్యాలు అద్భుతంగా ఉన్నాయి. పంటలు రికార్డు స్థాయిలో పండుతున్నాయి. కానీ పాలకుల వినాశకర విధానాలు రైతన్నలకు శాపంగా మారి వారి జేబులు ఖాళీగా ఉంటున్నాయి. ఉత్పత్తిలో పెరుగుదల కొనసాగుతున్నా పేద రైతులు ఇప్పటికీ ఆర్థిక సంక్షోభాన్ని చవిచూస్తేనే ఉన్నారు. భారతదేశంలో వ్యవసాయరంగం అతిపెద్ద రంగంగా ఉంది. ఏటా, మంత్రులు కెమెరాల ముందు నిలబడి రికార్డు ఉత్పత్తి లక్ష్యాలను ప్రకటిస్తున్నారు, దేశ రైతులు స్వయం సమృద్ధి, శ్రేయస్సు వైపు అడుగులు వేస్తున్నారని చెబుతున్నారు. తాజాగా జరిగిన జాతీయ వ్యవసాయ సదస్సు రబీ అభియాన్ 2025లో కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ మాట్లాడుతూ, 2025-26 సంవత్సరానికి 362.5 మిలియన్ టన్నుల ఆహార ధాన్యాల ఉత్పత్తి లక్ష్యాలను నిర్దేశించారు. ఇది పైకి చూడడానికి ఆకట్టుకునేలా కనిపిస్తోంది. లోతుగా పరిశీలిస్తేగానీ అసలు భండారం బయటపడదు. గత సంవత్సరం, భారతదేశం 353.96 మిలియన్ టన్నుల ఆహార ధాన్యాలను ఉత్పత్తి చేసింది - ఇది రికార్డు, ఆ ఏడాది అధికారిక ఉత్పత్తి లక్ష్యం 341.55 మిలియన్ టన్నుల కంటే ఎక్కువగానే ఉత్పత్తి జరిగింది.

పాలకుల ఆకర్షణీయ నినాదాలు, సమావేశ మందిరాల్లో వారి ప్రసంగాలకు చప్పట్లను తరిచిచూస్తే చీకటిచిత్రం బయటపడుతుంది. భారతదేశ వ్యవసాయం లోపాయికారి సేకరణ, పెరిగిన సబ్సిడీలు, అస్థిర ప్రపంచ మార్కెట్లు, వాతావరణ మార్పు చక్రంలో చిక్కుకుపోయింది. ప్రభుత్వం ప్రధాన లక్ష్యాలను నిర్ణయించడం వల్ల వ్యవసాయ ఆర్థిక వ్యవస్థ రాజకీయ దృక్పథాలు, రైతు వాస్తవాల మధ్య వైరుధ్యాల కింద కుంగిపోతున్నదనే వాస్తవం మరుగునపడిపోతోంది. నిజమే, భారతదేశంలో బియ్యం, గోధుమలు విస్తారంగా పండుతున్నాయి. భారత ఆహార సంస్థ (ఎఫ్‌సీఐ) గోదాములు నిండిపోతున్నాయి. 2023-24 సంవత్సరంలో ఈ రెండు పంటలపైనే సేకరణ ఖర్చు రూ. 2.1 ట్రిలియన్లు దాటింది. ప్రజాపంపిణీ వ్యవస్థ ద్వారా లక్షలాది మందికి సబ్సిడీపై ఆహార ధాన్యాలు అందిస్తూనే ఉన్నారు.

ఒకపక్క కేంద్రం తనను తాను అభినందించుకుంటుండగా, దేశం తన వంట నూనె అవసరాలలో దాదాపు 60శాతం దిగుమతి చేసుకుంటోంది ప్రపంచంలోనే అతిపెద్ద పప్పు ధాన్యాల కొనుగోలుదారుగా కొనసాగుతోంది. రికార్డు స్థాయిలో ధాన్యం ఉందని గొప్పలు చెప్పుకునే కేంద్ర ప్రభుత్వం ప్రతి కొన్ని నెలలకు ఒకసారి కందిపప్పు లేదా పామాయిల్‌ను విదేశాలకు ఎగుమతి చేయడానికి తహతహలాడుతోంది. ఇది ఆహార భద్రత కాదు. ఇది ఎంపిక చేసిన సమృద్ధి - రాజకీయ నాయకులు ఎదుర్కోవడానికి నిరాకరించే విధానపరమైన అసమతుల్యత. బియ్యం, గోధుమలు ఎన్నికలలో లబ్ధి చేకూరుస్తాయి, నూనెగింజలు, పప్పుధాన్యాలు ఓట్లకు హామీ ఇవ్వవు కనుక బియ్యం, గోధుమల ఉచిత పంపిణీకి పాలకులు దృష్టి కేంద్రీకరిస్తున్నారు. ఈ అసమతుల్యత యాదృశ్చికం కాదు. ఇది భారతదేశ కనీస మద్దతు ధర (ఎంఎస్‌పీ) విధానంలో భాగంగా ఉంది. 23 పంటలకు ఎంఎస్‌పీ అధికారికంగా ప్రకటించినప్పటికీ, సేకరణ ఖర్చులో 70% కంటే ఎక్కువ బియ్యం, గోధుమలకు వెళుతుంది. పప్పుధాన్యాలు, నూనెగింజలు ఈ వ్యవస్థ సవతి పిల్లలుగా మారిపోయాయి. వాటి

సేకరణలో ఒక క్రమపద్ధతి ఉండదు. చాలా తక్కువగా నిల్వ చేస్తారు. ధరలు ఎక్కువగా ఉన్నప్పుడు ప్రైవేట్ మార్కెట్లలోకి తిరిగి పంపుతారు. రైతులు వెర్రివారు కాదు, బియ్యం లేదా గోధుమలను పండిస్తే ప్రభుత్వం సేకరిస్తుందనీ, ఎంతో కొంత మద్దతు ధర ఇస్తుందని వారికి తెలుసు. అదే పప్పుధాన్యాలు, నూనె గింజలు పండిస్తే నిలకడలేని ధరలు, మద్దతు ధర లేకుండా తమతో ఆటలాడుకుంటుందని రైతులకు బాగా తెలుసు.

> పాలకుల ఆకర్షణీయ నినాదాలు, సమావేశ మందిరాల్లో వారి ప్రసంగాలకు చప్పట్లను తరిచిచూస్తే చీకటిచిత్రం బయటపడుతుంది. భారతదేశ వ్యవసాయం లోపాయికారి సేకరణ, పెరిగిన సబ్సిడీలు, అస్థిర ప్రపంచ మార్కెట్లు, వాతావరణ మార్పు చక్రంలో చిక్కుకుపోయింది. ప్రభుత్వం ప్రధాన లక్ష్యాలను నిర్ణయించడం వల్ల వ్యవసాయ ఆర్థిక వ్యవస్థ రాజకీయ దృక్పథాలు, రైతు వాస్తవాల మధ్య వైరుధ్యాల కింద కుంగిపోతున్నదనే వాస్తవం మరుగునపడిపోతోంది.

రైతులను పప్పుధాన్యాలు, నూనెగింజల వైపు మొగ్గు చూపాలని ప్రతి సంవత్సరం విధాన నిర్దేశాలు కోరుతున్నారు. అన్నదాతలు ఆ సూచనను ఏమాత్రం పట్టించుకోరు. ఎందుకంటే ప్రోత్సాహకాలు మార్పునకు వ్యతిరేకంగా ఉంటాయి. ప్రభుత్వం తన సేకరణ విధానాన్ని మార్చుకోకపోవడం, కావాల్సిన చోట డబ్బు పెట్టకపోవడమే నిజమైన వైఫల్యం తప్ప రైతుల ప్రతిఘటన కాదు. పంట ఎంపికను సేకరణ తప్పుదోవపట్టిస్తే మిగిలిన అన్నింటిని సబ్సిడీలు తప్పుదోవపట్టిస్తున్నాయి. ఒకప్పుడు భారతదేశానికి రుతుపవనాలు లాటరీలాంటివి. ఇప్పుడు వారికి ఆటలామారింది. అనూహ్యంగా, వినాశకరంగా తయారైంది. ఈ ఏడాది సెప్టెంబరు మధ్యనాటికి దేశవ్యాప్తంగా వర్షపాతం సాధారణం కంటే 7శాతం అధికంగా నమోదైంది. కానీ సగటు గందరగోళాన్ని దాచిపెడుతున్నది. పంజాబ్, హర్యానా రాజస్థాన్ 40 నుంచి 68% అధిక వర్షపాతంతో మునిగిపోయాయి, బీహార్, అసోం 30నుంచి 40శాతం లోటుతో ఎండిపోయాయి. లడఖ్ 400% అధిక వర్షపాతంతో అతలాకుతలమైంది. ఇప్పటికే ఈ పరిణామాలు కనిపిస్తున్నాయి. హిమాచల్‌ప్రదేశ్, పంజాబ్, మహారాష్ట్ర, అసోంలో వరదలకు చేతికి అందివచ్చిన పంటలు కొట్టుకుపోయాయి. కరువు వంటి పరిస్థితులు తూర్పు ప్రాంతాన్ని పీడిస్తున్నాయి. మొత్తం మీద దేశంలో రికార్డు స్థాయిలో పంట పండిందని గొప్పలు చెప్పుకోవచ్చు. వాస్తవంగా చూస్తే రైతన్న వ్యక్తిగతంగా నష్టాలు చవిచూస్తున్నాడు. అటువంటి నష్టాల నుంచి రైతన్నను బయటపడేసేందుకు ప్రధానమంత్రి పసల్ బీమా యోజన రూపొందించినట్లు పాలకులు గొప్పగా చెప్పుకుంటున్నారు. అయితే, ఆచరణలో ఇది పదేపదే విఫలమైంది. క్లెయిమ్ పరిష్కారం ఆలస్యం అవుతోంది, పంట నష్టం తక్కువ అంచనా వేస్తున్నారని రైతులు ఫిర్యాదు చేస్తున్నారు. నష్టపరిహారం కోసం రైతులు నెలలతరబడి వేచిచూస్తుండగా బీమా సంస్థలు మాత్రం కోట్లు సంపాదిస్తున్నాయి. పరిహారం సకాలంలో చెల్లిస్తామని ప్రతి సంవత్సరం మంత్రులు వాగ్దానాలు గుప్పిస్తుంటారు, వరద ప్రభావిత ప్రాంతాలలోని రైతుల చెంతకు మాత్రం ఆ పరిహారం చేరకపోవడం అత్యంత విచారకరం.

విత్తనాలు సంమృద్ధిగా ఉన్నాయని ప్రభుత్వం నొక్కి చెపుతోంది. 22.9 మిలియన్ టన్నుల విత్తనాలు అవసరం ఉండగా, 25 మిలియన్ మెట్రిక్ టన్నులు అందుబాటులో ఉన్నాయని పాలకులు చెపుతున్నారు. అయితే, ఎరువుల కథ మరో విధంగా ఉంది. విత్తనాలు ఎక్కువగా నాటడంతో ఎరువులకు డిమాండ్ ఇప్పటికే పెరుగుతోంది. ఫాస్ఫేట్, పొటాషియం ఎరువుల దిగుమతి ప్రపంచ సుస్థిరతకు హానికలిగిస్తోంది. అధికారిక చానెళ్లు మూసుకుపోయినప్పుడు బ్లాక్‌మార్కెటింగ్ పెరుగుతుంది. రైతులు అధిక ధరలు చెల్లించాల్సి వస్తుంది. ఇంకా దారుణంగా, నకిలీ విత్తనాలు వ్యాప్తి చెందుతూనే ఉన్నాయి. రాజస్థాన్‌లో నిర్వహించిన దాడుల్లో నకిలీ పురుగుమందులు, ఎరువులు బయటపడ్డాయి, కానీ అలాంటి దాడులు అడపాదడపా మాత్రమే జరుగుతాయి. పంటలు బాగా పండనప్పుడు మాత్రమే చిన్న వ్యాపారులపై దాడిచేసి నకిలీ విత్తనాలను కనుగొంటారు. అప్పటికే చాలా ఆలస్యం అయిపోతుంది. నష్టాన్ని పూర్తిగా రైతులే భరిస్తున్నారు. బ్యూరోక్రాటిక్ ముసుగులో జవాబుదారీతనం కనుమరుగైపోతోంది. "ప్రయోగశాల నుంచి భూమికి" నినాదాలను ఇష్టపడే ప్రభుత్వాలు రైతులకు నకిలీ ఇన్‌పుట్‌లు అందకుండా చూసుకోవడం అత్యంత ప్రధాన బాధ్యత. అయినప్పటికీ, ఏటికేడు ఈ సమస్య కొనసాగుతూనే ఉంది.

కేంద్రంలోని మోదీ ప్రభుత్వం 2022 నాటికి రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేస్తామని హామీ ఇచ్చింది. ఆ గడువు దాటిపోయింది, అయినా, దాని గురించి నోరుమెదపడంలేదు. తాజా సర్వేలు వ్యవసాయ కుటుంబం సగటు నెలవారీ ఆదాయం రూ. 12,000 కంటే తక్కువగా ఉందని చూపిస్తున్నాయి. భారతదేశం ధాన్యం కొరత ఎదుర్కోవడం లేదు. రాజకీయ సంకల్పం కొరతతో బాధపడుతోంది. ఆ లోటును తీర్చే వరకు, ప్రతి రికార్డు పంట ఒక మైలురాయి కంటే తక్కువ కాదు - ఇది పురోగతికి రుజువు కాదు, కానీ విజయంగా ధరించిన విఫలమైన వ్యవసాయ ఆర్థిక శాస్త్రాన్ని దేశం ఎంత మొండిగా పట్టుకుని ఉందో దానికి నిదర్శనం.

కేరళలో ఆర్ఎస్ఎస్‌కు ఎదురుదెబ్బ

పి. శ్రీకుమారన్

కేరళలో శబరిమలై కొండపైగల ఆలయానికి సమీపంలో ప్రపంచ అయ్యప్ప సంగమం నిర్వహించడానికి ట్రావెన్‌కోర్ దేవస్థానం బోర్డు (టీడీబీ) కు అనుమతివ్వడానికి కేరళ హైకోర్టు అనుమతించింది. అయితే పంపానది ఒడ్డున ప్రపంచ అయ్యప్ప సంగమం నిర్వహించడానికి అనుమతించాలన్న బీజేపీ, ఆర్ఎస్ఎస్‌ల విజ్ఞప్తిని కేరళ కోర్టు అనుమతించగా రాష్ట్రప్రభుత్వం అనుమతించరాదన్న విజ్ఞప్తిని సుప్రీంకోర్టు పరిగణలోకి తీసుకుని హైకోర్టు తీర్పులో జోక్యం చేసుకోకూడదని తెలిసింది. ఈ విధంగా సుప్రీంకోర్టు హైకోర్టు అనుమతిని తిరస్కరించడం ఇది రెండవసారి. పంపానది ఒడ్డున ప్రపంచ అయ్యప్ప సంగమం నిర్వహించడం కేవలం వాణిజ్యం కోసమేనని రాష్ట్ర ప్రభుత్వం అభ్యంతరం తెలిపింది. కొన్ని షరతుల మేరకు సంగమంను అనుమతిస్తూ హైకోర్టు సెప్టెంబరు 11న తాత్కాలిక ఉత్తర్వులు జారీచేసింది.

హైకోర్టు తాత్కాలికంగా అనుమతిస్తూ జారీ చేసిన ఉత్తర్వులో మేము జోక్యం చేసుకోవడంలేదని సుప్రీం కోర్టు తెలిపింది. ప్రపంచ అయ్యప్ప సంగమం ఉత్సవాన్ని నిర్వహించడానికి హైకోర్టు కొన్ని షరతులను విధించింది. హైకోర్టు సి.ఎస్ నరసింహ నాయకత్వంలోని ధర్మాసనం అనుమతించడానికి సంబంధించిన అన్ని ప్రశ్నలు బహిరంగంగానే ఉన్నాయని అందువల్ల ఇతర అంశాలను ప్రస్తావించవలసిన అవసరం లేదని తెలిపింది. పంపానది ఒడ్డున ఉత్సవం నిర్వహించడాన్ని వ్యతిరేకిస్తూ 2022లో కేరళ హైకోర్టులో రాష్ట్ర ప్రభుత్వం పిటీషన్ దాఖలుచేసింది. ప్రభుత్వం తరఫున భక్తులైన న్యాయవాదులు వివి అజిత్‌కుమార్, టిఎస్ మహేంద్రకుమార్, అజీష్ కలథిల్ గోపిలు పిటిషన్ దాఖలుచేశారు. ప్రతికూలించిన సంగమం పూర్తిగా వాణిజ్య కార్యకలాపం. అందువల్ల అనుమతించరాదని పిటిషనర్లు అభ్యంతరం తెలిపారు. అయ్యప్ప ఆలయానికి సమీపంలో పంపానది ఒడ్డున ఇలాంటి వాణిజ్యాన్ని నిర్వహిండం సరైందికాదని పిటిషనర్లు తెలిపారు. కేవలం సంపాదనకే సంగమం ప్రతిపాదన చేశారని పిటిషనర్లు వాదించారు. ఈ సంగమం మతం లేదా ఆధ్యాత్మిక కార్యకలాపాలతో ఏమాత్రం సంబంధం లేదని వారు తెలిపారు.

సెప్టెంబరు 20వ తేదీన సంగమం కార్యక్రమాన్ని నిర్వహించడానికి రాష్ట్ర ప్రభుత్వాన్ని, టీడీబీ, వారి అధికారులు, ఏజంట్లను అనుమతించరాదని పిటిషనర్లలో ఒకరు సుప్రీంకోర్టును కోరారు. అలాగే సంగమం కార్యక్రమం దేవత పేరుతో నిర్వహించడానికి ఆలయం నిధులను, ఆస్తులను, సేవలను సైతం అనుమతించకూడదని ఆయన సుప్రీంకోర్టును కోరారు. తుదితీర్పునకు స్పెషల్ లీవ్ పిటిషన్‌ను విచారణ చేయాలనికోరగా, ఇంకా అది పెండింగ్‌లో ఉంది. ట్రావెన్‌కోర్-కొచ్చిన్ హిందు మత సంస్థల చట్టం 1950ని ఉల్లంఘిస్తూ హైకోర్టు ఉత్తర్వుజారీ చేసిందని లాయర్ మహేంద్రకుమార్ అభ్యంతరం తెలిపారు. సంగమం ప్రతిపాదనపెట్టిన వారి వాదాన్ని ఉన్నతస్థాయి కోర్టు తిరస్కరించింది. ఇది కేవలం తాత్కాలిక ఉత్తర్వు.

మేము ఎందుక జోక్యం చేసుకోవాలి? సంగమం నిర్వహణకు వారికి అధికారం ఎక్కడ ఉంది? అది నిర్వహించడం సరైందని ఎక్కడ చెప్పారు హైకోర్టు దీనిని పరిశీలిస్తుంది అని న్యాయమూర్తి నరసింహ ప్రశ్నించరు. సుప్రీంకోర్టు ఉత్తర్వు ఎల్‌డిఎఫ్ చేతిలో ఆయుధమైంది. అంతేకాదు, సుప్రీంకోర్టు ఉత్తర్వు హిందుత్వ గ్రూపునకు తీవ్రమైన దెబ్బ తగిలింది. సంగమం నిర్వహించడానికి అనుమతించేదిలేదని ప్రభుత్వం కచ్చితంగా తెలిపింది. శబరిమల భవిష్యత్తు అభివృద్ధికి ఇది ఆటంకమవుతుందని, అలాగే ప్రపంచ భక్తుల కేంద్రాన్ని ఆటంకపరుస్తుందని గతంలో ప్రభుత్వం తీసుకున్న వైఖరిని సుప్రీంకోర్టు సమర్థించినట్లయింది. సుప్రీంకోర్టు ఉత్తర్వును దేవాదాయ, ధర్మాదాయ శాఖమంత్రి వివన్ వాసన్ మాట్లాడుతూ, ప్రపంచస్థాయిలో అయ్యప్ప భక్తులు వచ్చి తమ మొక్కులను తీర్చుకునేందుకు అన్ని కార్యక్రమాలను నెరవేర్చుకునేందుకు ఒక వేదిక అవుతుందని అన్నారు. శబరిమలైలో మౌలిక సదుపాయాలను అభివృద్ధిపరచేందుకు పెట్టుబడులు పెట్టడానికి వీలు కలుగుతుందని మంత్రి అన్నారు. వివిధ దేశాల ప్రభుత్వాలు సైతం ఇక్కడ పెట్టుబడులు పెట్టడానికి ముందుకువచ్చే అవకాశం ఉంటుందని భక్తుల యాత్రాకేంద్రంగా మార్చడానికి ఆయా ఆలయాల సంప్రదాయాలను పరిరక్షించుకునేందుకు వీలు కలుగుతుందని మంత్రి తెలిపారు.

టీడీబీ వజ్రోత్సవంలో భాగంగా సంగమంను నిర్వహించాలని తలపెట్టారు. ఈ ఉత్సవాలను మూడు వేదికలలో జరుపుతారు. కనీసం 3000 మందికిపైగా భక్తులు ఈ ఉత్సవాలకు హాజరవుతారు. ప్రభుత్వం ఈ ప్రణాళికలను వాస్తవంగా అనుమతించినట్లయితే అంచనావేసిన దానికంటే రెట్టింపు భక్తులు ఆలయాన్ని సందర్శిస్తారని కేరళ సెక్యులర్-బహుళ నైతికతలకు చిహ్నామని మంత్రి తెలిపారు. సంఘ్‌పరివార్ గ్రూపులో చీకట్లు అలుముకున్నాయి. సంగమం నిర్వహించడం ద్వారా నిధులు సమీకరించవచ్చునన్న ఆశ సంఘ్‌పరివార్‌కు ఏర్పడింది. 2018లో శబరిమలై ఆలయంలో మహిళలుసైతం ప్రవేశించవచ్చునన్న సుప్రీంకోర్టు తీర్పునుకూడా వ్యతిరేకించిందని ప్రభుత్వం తెలిపింది. ఇప్పుడు సంగమం ఉత్సవాన్నికూడా బీజేపీ-ఆర్ఎస్ఎస్‌లు చేసిన ప్రతిపాదనను ప్రభుత్వం తిరస్కరించింది. దీనితో హిందుత్వ గ్రూపునకు మద్దతు, ఉత్సాహాన్ని కలుగచేయడంతో కోర్టు తీర్పు విఫలమైంది. శబరిమలైకు సంబంధించిన వ్యవహారాలలో ప్రభుత్వ వ్యతిరేక వైఖరిని నాయర్ సర్వీసు సొసైటీ (ఎన్ఎస్ఎస్)కి ఎదురుదెబ్బ అయింది. ప్రభుత్వ వైఖరి అందరికీ ఆశ్చర్యాన్ని కలిగించింది. సుప్రీంకోర్టు తీర్పు ప్రభుత్వానికి ఉత్సాహాన్ని కలిగించింది. ఈ నేపథ్యంలో సెప్టెంబరు 20న శబరిమలై ఆలయంలో ఉత్సవాలను నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లను చేస్తున్నది. సుప్రీంకోర్టు తీర్పు ప్రభుత్వానికి అనుకూలంగా ఉండగా సంఘ్‌పరివార్ ఆశలు నెరవేరలేదు.

టూరిజం ప్రైవేట్‌పరం సరికాదు

- ప్రభుత్వ నిర్ణయంతో ఉద్యోగుల ఆందోళన
- రోడ్డున పడ్డ వందలాది ఉద్యోగులు, కార్మికులు
- ఐక్య ఉద్యమాలు తప్పవు
- పర్యాటక ఉద్యోగుల నిరసనలో రామకృష్ణ

విశాలాంధ్ర-విజయవాడ: పర్యాటకులకు వివిధ ప్రకృతి అందాలు, ఆనందం, ఆహ్లాదాన్ని అందించే పర్యాటకరంగాన్ని కూడా వదిలిపెట్టకుండా ప్రైవేట్‌పరం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏపీ టూరిజంలోని 20 హోటళ్ల ప్రైవేటీకరణకు నిరసనగా ఏఐటీయూసీ కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల సంఘం అధ్వర్యంలో విజయవాడలోని ధర్నాచౌక్‌లో గురువారం పెద్దఎత్తున ధర్నా చేపట్టారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సి.రామకృష్ణ అధ్యక్షతన జరిగిన సభలో కె.రామకృష్ణ మాట్లాడుతూ గతంలో చంద్రబాబు తీసుకున్న నిర్ణయాలు టూరిజం అభివృద్ధికి దోహదపడ్డాయని, చిన్నచిన్న సమస్యలు మినహా ఉద్యోగులు ప్రశాంత వాతావరణంలో విధులు నిర్వర్తించారని గుర్తుచేశారు. ప్రస్తుత ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో ఉద్యోగులు రోడ్డెక్కి ఆందోళన చేయాల్సిన పరిస్థితి వచ్చిందన్నారు. ఈ నిర్ణయంపై ప్రభుత్వం ఆత్మపరిశీలన చేసుకోవలసిన అవసరం ఉందని, ఉద్యోగ సంఘ నాయకులను పిలిచి... సమస్యలు తెలుసుకుని ఉద్యోగులకు భరోసా కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా కోట్లాది రూపాయల విలువగల ఆస్తులను ప్రైవేట్ వ్యక్తులకు కట్టబెట్టడం టూరిజం వ్యవస్థను నిర్వీర్యం చేయడమేనని స్పష్టం చేశారు. ప్రైవేట్ హోటళ్ల వద్ద కనీసం పార్కింగ్, ఇతర సౌకర్యాలు ఉండటం లేదన్నారు. హోటళ్లను ప్రైవేట్ వ్యక్తులు నిర్వహించడంతో ఉద్యోగులకు, కార్మికులకు తీరని అన్యాయం జరుగుతోందని, ఉద్యోగ భద్రత కోల్పోయే ప్రమాదం ఉందని తెలిపారు. మంచి వాతావరణాన్ని పర్యాటకులకు అందించే టూరిజాన్ని సమీక్షించి... అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందన్నారు. అంతేకాకుండా టూరిజంలో దాదాపుగా 25 సంవత్సరాల నుండి విధులు నిర్వహిస్తున్న వందలాది ఉద్యోగుల హక్కులను హరించకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. సీఎం చంద్రబాబును కొంతమంది తప్పుదారిలో నడిపిస్తున్నారని, దీంతో పలు నిర్ణయాలు ప్రజలకు, ఉద్యోగులకు ఆటంకంగా మారుతున్నాయన్నారు. రాష్ట్రంలో విద్య, వైద్య, టూరిజం, విశాఖ ఉక్కు, ఆర్టీసీ వంటి వ్యవస్థలను ప్రైవేట్‌పరం చేసి... కేవలం అమరావతి రాజధాని నిర్మించడం వలన ప్రజలకు ప్రయోజనం ఏమిటని ప్రశ్నించారు. ప్రభుత్వ విద్యాసంస్థలను నిర్వీర్యం చేసి... నారాయణ, చైతన్య, గీతం, విజ్ఞాన్, భాష్యం వంటి ప్రైవేట్ విద్యాసంస్థలకు దోచిపెడుతున్నారని మండిపడ్డారు. ప్రభుత్వ వైద్య కళాశాలలను ప్రైవేట్‌పరం చేయడం ద్వారా పేదలు, మధ్యతరగతికి వైద్య విద్యను దూరం చేస్తున్న దుర్మార్గపు నిర్ణయాలతో రాష్ట్రాన్ని అథోగతి పాలుచేస్తున్నారని విమర్శించారు. చంద్రబాబు పద్ధతి మార్చుకోవాలన్నారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు అనేక సమస్యలపై కలిసి పోరాటం చేశామని, అధికారంలోకి వచ్చిన తరువాత ప్రజావ్యతిరేక విధానాలు అవలంబించడం సరికాదన్నారు. మతతత్వాన్ని పెంచిపోషించే బీజేపీ అనుకూల పాలన సాగిస్తూ తొలి ప్రధాని నెహ్రూను కూడా విమర్శించే హక్కు చంద్రబాబుకు లేదని, నెహ్రూ దూరదృష్టితో నిర్మించిన భారీ నీటి ప్రాజెక్టులతోనే 146 కోట్ల మంది ప్రజలు అన్నం తింటున్న విషయాన్ని విస్మరించరాదన్నారు. విశాఖ ఉక్కు కర్మాగారం ద్వారా వేలాదిమంది ఉద్యోగులు, కార్మికులకు ఉపాధి అవకాశాలు లభించాయని, అటువంటి విశాఖ ఉక్కును ప్రైవేట్‌పరం చేస్తుంటే చంద్రబాబు మౌనంగా ఉండటం దారుణమన్నారు. ఉద్యోగులకు, కార్మికులకు అండగా ఉంటామని, వివిధ పార్టీలను, ప్రజాసంఘాలను ఏకంచేసి ప్రభుత్వంపై పోరాటం చేస్తామని ప్రకటించారు. ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు రావులపల్లి రవీంద్రనాథ్ మాట్లాడుతూ టూరిజంలో భాగమైన హోటళ్ల ప్రైవేటీకరణతో ఉద్యోగులు, కార్మికులకు తీరని అన్యాయం జరుగుతోందని అన్నారు. ఉద్యోగులకు నష్టం కలిగించే ప్రభుత్వ నిర్ణయాన్ని వెనక్కు తీసుకోవాలని, జీవో 23ను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. గతంలో పలు రూపాల్లో ఉద్యమాలు చేయడం వల్ల అనేక సమస్యలు పరిష్కరించుకున్నామని, ఆ స్ఫూర్తితో ఉద్యోగులందరూ ఐక్యతతో పోరాడితే ప్రభుత్వాలు దిగిరాకతప్పదన్నారు. ఉద్యోగులు, కార్మికులకు ఏఐటీయూసీ అండగా ఉంటుందని స్పష్టం చేశారు. ధర్నాలో సంఘం నాయకులు ప్రసాద్, రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుండి ఉద్యోగులు, కార్మికులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

జీఎస్టీ సంస్కరణలు పేద, మధ్యతరగతి ప్రజలకు మేలు: పవన్

విశాలాంధ్ర బ్యూరో - అమరావతి: దేశవ్యాప్తంగా అమలుకానున్న జీఎస్టీ 2.0 సంస్కరణలు పేద, మధ్యతరగతి ప్రజలకు మేలు చేస్తాయని, ప్రతి కుటుంబానికి లబ్ధి చేరేలా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సహకరిస్తుందని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అన్నారు. శాసనసభలో జీఎస్టీ 2.0పై జరిగిన చర్చలో ఆయన మాట్లాడుతూ "ప్రధాని మోదీ సారథ్యంలో కేంద్ర ప్రభుత్వం తెస్తున్న ఈ సంస్కరణలు దేశ ఆర్థికవృద్ధికి, పరిశ్రమల విస్తరణకు దోహదం చేస్తాయి" అని పేర్కొన్నారు. పేదల కొనుగోలు శక్తి పెరిగి, కొత్త పరిశ్రమలు రావడానికి, ఉపాధి అవకాశాలు పెరగడానికి జీఎస్టీ 2.0 తోడ్పడుతుందని వివరించారు. సంస్కరణలకు మద్దతు తెలిపిన తొలి రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ అని ఆయన స్పష్టం చేశారు. ప్రజల ఆర్థికాభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వంతో కలిసి ఈ సంస్కరణల విజయవంతమైన అమలుకు రాష్ట్రం సహకరిస్తుందని ఆయన హామీ ఇచ్చారు.

ఎన్నికల ప్రక్రియ నాశనానికే ఈసీ కుట్రలు: ప్రియాంక

వయనాడ్: ఎన్నికల విధానం నాశనానికి, ప్రజాస్వామ్యాన్ని సవాల్ చేసేలా ఎన్నికలు సంఘం కుట్రలు చేస్తుందని కాంగ్రెస్ ఎంపీ ప్రియాంక గాంధీ మండిపడ్డారు. ప్రతిపక్ష పార్టీల ఓట్ల తొలగింపు కోసం సంస్థాగత కసరత్తు జరుగుతుందన్న లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీతో ఏకీభవించారు. రాహుల్ అన్ని వివరాలను విలేకరుల సమావేశంలో వెల్లడించారని, ఆయన చెప్పేది వింటే దేశంలో అసలేం జరుగుతోందన్నది అర్థమవుతుందని ప్రజలకు సూచించారు. ప్రియాంక గురువారం కేరళ, వయనాడ్‌లో విలేకరులతో మాట్లాడుతూ ఈసీ తీరును ఆక్షేపించారు. ఓట్ల చోరీ ఆరోపణ మాత్రమే కాదని, రాహుల్ అన్ని ఆధారాలు చూపారని చెప్పారు. ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని, దేశాన్ని పరిరక్షించుకోవడం కోసం పోరాడదామంటూ ప్రియాంక పిలుపునిచ్చారు. ఇదిలావుంటే, ఎన్నికల సంఘం స్వతంత్ర వ్యవస్థగా కాక, కేంద్ర ప్రభుత్వ నియంత్రణలో వ్యవస్థగా ఉందని కర్నాటక మంత్రి రామలింగా రెడ్డి విమర్శించారు. కాగా, కర్నాటక సీఐడీ ఓటర్ల మోసాలపై దర్యాప్తునకు ఎన్నికల సంఘం సహకరించడం లేదని, ఓట్ల దొంగలను సీఈసీ జ్ఞానేశ్ కుమార్ కాపాడుతున్నారని రాహుల్ గాంధీ దుయ్యబట్టారు.

ఒడిశా ప్రభుత్వంపై కాంగ్రెస్ అవిశ్వాసం

భువనేశ్వర్: ఒడిశా అసెంబ్లీ వర్షాకాల సమావేశాల మొదటి రోజే బీజేపీ ప్రభుత్వంపై అవిశ్వాస తీర్మానానికి కాంగ్రెస్ సిద్ధమైంది. ఆ పార్టీ నాయకుడు రామచంద్ర కదం నాయకత్వంలో కాంగ్రెస్ ఎమ్మెల్యేలంతా అసెంబ్లీ కార్యదర్శి సత్యవ్రత రౌత్‌ను కలిసి 15 నెలల బీజేపీ ప్రభుత్వంపై అవిశ్వాస తీర్మానాన్ని ప్రవేశపెట్టేందుకు నియమం 117 (1) కింద అనుమతి కోరారు. 14 మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, ఒక సీపీఎం ఎమ్మెల్యే సంతకాలతో పిటిషన్ అందజేశారు. అనంతరం కదం విలేకరులతో మాట్లాడుతూ అవిశ్వాస తీర్మానాన్ని ప్రవేశపెట్టేందుకు ప్రధాన ప్రతిపక్షమైన బీజూ జనతా దళ్ (బీజేడీ)ని కోరినప్పటికీ సరైన స్పందన లభించకపోవడంతో తాము సొంతంగా ముందడుగు వేశామని చెప్పారు. తమతో కలిసి రావాలని ప్రాంతీయ పార్టీలను కోరారు. బీజేడీ వేరుగా అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టాలని భావిస్తే మద్దతు ఇచ్చేందుకు అభ్యంతరం లేదన్నారు. అనంతరం కాంగ్రెస్ ప్రతినిధి బృందం ప్రతిపక్ష నాయకుడి చాంబర్‌కు వెళ్లగా, నవీన్ పట్నాయక్ లేకపోవడంతో ఆ పార్టీకి చెందిన ఇద్దరు ఎమ్మెల్యేలతో చర్చించారు. తాజా పరిణామంపై బీజేడీ నేత ప్రమీలా మాలిక్ స్పందించారు. కాంగ్రెస్ ఇంకా తమను సంప్రదించలేదని చెప్పారు. వాళ్లు చేయాలనుకున్నది చేయనివ్వండి... బీజేడీ సొంత నిర్ణయాలు తీసుకోగలదు అని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలా విఫలమైందని, మహిళలకు భద్రత కల్పించలేకపోతోందని, శాంతి భద్రతల నిర్వహణ సమస్యగా మారిందని, రైతులు, దళితులు, గిరిజనులు, ఓబీసీలు అభద్రతా భావంతో బిక్కుబిక్కు మంటున్నారని కదం వెల్లడించారు. అవిశ్వాస తీర్మానం విషయంలో బీజేడీ కలిసి రావాలన్నారు. విడిగా ఆ పనిని చేసినా తమకు అభ్యంతరం లేదని, బేషరతుగా మద్దతు ఇస్తామని కదం చెప్పారు. ఇదిలావుంటే, కాంగ్రెస్ ఈ చర్యతో నవ్వుల పాలవుతుందని బీజేపీ ఎమ్మెల్యే జయనారాయణ్ మిశ్రా విమర్శించారు. కాంగ్రెస్‌కు సంఖ్యాబలమే లేదని, ఇది వృథా ప్రయాస అంటూ ఎద్దేవా చేశారు. ప్రతిపక్ష హోదా కోసం బీజేడీ, కాంగ్రెస్ పోటీ పడుతున్నాయన్నారు. కాగా, 147 మంది సభ్యులు ఉన్న అసెంబ్లీలో బీజేపీకి 78 మంది, బీజేడీకి 50 మంది, కాంగ్రెస్‌కు 14 మంది, సీపీఎంకు ఒకరు, ముగ్గురు స్వతంత్ర ఎమ్మెల్యేలు ఉన్నారు. ఒక స్థానం ఖాళీగా ఉంది.

గట్టిగా నిలదీయండి

సభ్యులకు జగన్ దిశానిర్దేశం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ప్రజా సమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీయాలని పార్టీ సభ్యులకు వైసీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సూచించారు. శాసనమండలిలో బలం ఉందని, సభ్యులు గట్టిగా నిలబడాలన్నారు. చంద్రబాబు ప్రభుత్వం ఏకపక్షంగా వ్యవహరిస్తూ ప్రతిపక్షం లేకుండా ఉండాలని కోరుకుంటోందని, అందుకే మాట్లాడే అవకాశం ఇవ్వడం లేదని అన్నారు. తాడేపల్లి వైసీపీ కేంద్ర కార్యాలయంలో ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో మాజీ సీఎం భేటీ అయ్యారు. శాసనసభ, మండలి సమావేశాలలో అనుసరించాల్సిన వ్యూహంపై సభ్యులకు దిశా నిర్దేశం చేశారు. ఇంత తక్కువ వ్యవధిలోనే ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత రావడం ఇదే మొదటిసారిగా చెప్పారు. ఈ ప్రభుత్వం అన్ని విధాలా విఫలమైందని విమర్శించారు. శాసనసభలో మాట్లాడేందుకు తమకు తగిన సమయం కేటాయించడం ఇష్టం లేకనే, వైసీపీని ప్రధాన ప్రతిపక్షంగా గుర్తించడంలేదని జగన్ వ్యాఖ్యానించారు. ఒక ఎమ్మెల్యేకు మాత్రమే ఇచ్చే సమయంలో ప్రజా సమస్యలు ఎలా ప్రస్తావిస్తామని ప్రశ్నించారు. చంద్రబాబు ప్రభుత్వాన్ని నిలదీసేందుకు మెటీరియల్ సిద్ధంగా ఉందని, సభలో మాట్లాడనివ్వడం లేదు కాబట్టే వెళ్లడంలేదని చెప్పారు. విద్య, వైద్యం, వ్యవసాయ రంగాలు పూర్తిగా నిర్వీర్యం చేశారని, ఫీజు రీయింబర్స్‌మెంట్ ఏడు త్రైమాసికాలు పెండింగ్ ఉందని, రూ.4900 కోట్ల బకాయి పేరుకుందని జగన్ వెల్లడించారు. వైద్య కళాశాలలను ప్రైవేటీకరించి పేదలకు వైద్య విద్య అందకుండా చేశారని, వ్యవసాయ రంగ పరిస్థితి దారుణంగా ఉందన్నారు. ఎక్కడికక్కడ దోపిడి సాగుతోందని, అన్నింటా విఫలమైనా నిస్సిగ్గుగా సూపర్‌హిట్ అని చెప్పుకుంటున్నారని విమర్శించారు. 18 ఏళ్లు నిండిన మహిళలకు నెలకు రూ.1500, నిరుద్యోగ భృతి రూ.3 వేలు, 50 ఏళ్లు నిండిన వారందరికీ రూ.4 వేల పింఛన్ లేదని, పథకాలు మాయాయని, ప్రజల గొంతు వినడం ప్రభుత్వానికి ఇష్టం లేదని జగన్ విమర్శించారు.

ఇళ్ల స్థలాల రద్దుకు అధికారం ఎవరిచ్చారు?

'మీకు అధికారం ఇచ్చింది పేదలపై కత్తికట్టడానికా? వారి సొంతింటి కలలను నాశనం చేయడానికా? అంటూ రాష్ట్ర ప్రభుత్వాన్ని జగన్ ప్రశ్నించారు. ఈ ప్రభుత్వానికి పేదలకు ఇవ్వడం తెలియదు... వారికి అందేవి కూడా రద్దు చేస్తుందని విమర్శించారు. పేదల వ్యతిరేక పాలన రాష్ట్రంలో సాగుతోందని 'ఎక్స్'లో దుయ్యబట్టారు. 'పేద అక్కచెల్లెమ్మలకు రిజిస్ట్రేషన్ చేసిమరీ ఇచ్చిన ఇళ్ల స్థలాలను రద్దు చేసే అధికారం మీకు ఎవరు ఇచ్చారు? వాళ్లు ఇళ్లు కట్టుకునేలా అండగా నిలబడాల్సింది పోయి, మా హయాంలో ఇచ్చిన స్థలాలను లాక్కుంటారా?' అని నిలదీశారు. తక్షణమే ఈ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని అని జగన్ డిమాండ్ చేశారు.

సెన్సార్‌షిప్‌కు దారితీస్తాయి

అదానీపై కంటెంట్ తొలగింపు ఉత్తర్వులపై ఎడిటర్స్ గిల్డ్

న్యూఢిల్లీ: అదానీ ఎంటర్‌ప్రైజెస్ లిమిటెడ్ (ఏఈఎల్) సంబంధించిన 138కుపైగా వీడియోలు,83 పోస్టులను ఐదు రోజుల్లోగా తొలగించాలని జర్నలిస్టులు, కంటెక్ట్ క్రియేటర్లకు ఐటీ శాఖ, దిల్లీ కోర్టు ఆదేశాలపై ఎడిటర్స్ గిల్డ్ తీవ్ర ఆందోళన వ్యక్తంచేసింది. కార్పొరేట్లకు కొమ్ముకాసేలా తాజా ఉత్తర్వులు ఉన్నాయని గురువారం ఒక ప్రకటన చేసింది. కార్పొరేట్ సంస్థకు పరువు నష్టం కలిగించే ఏదైనా కంటెంట్‌కు సంబంధించిన యూఆర్‌ఎల్‌లను, లింక్‌లను మధ్యవర్తులు లేదా ప్రభుత్వ సంస్థలకు పంపడానికి, ఆ తర్వాత 36 గంటల్లోపు అటువంటి కంటెంట్‌ను తొలగించాలని ఆయా వర్గాలను ఆదేశించే అధికారాన్ని తాజా ఉత్తర్వులు ఇస్తుండటం మరింతగా ఆందోళన కలిగిస్తోందని ఎడిటర్స్ గిల్డ్ పేర్కొంది. ఐటీ శాఖ వ్యవహారం కూడా ఇబ్బందికరంగా ఉందని వెల్లడించింది. ఈ విధంగా అధికారాలను విస్తరించడంతో ప్రైవేటు కార్పొరేషన్‌కు వారి వ్యవహారాలకు సంబంధించి పరువు నష్టం కలిగించే కంటెంట్ ఏమిటో నిర్ణయించే అధికారాలు ఇచ్చినట్లేనని పేర్కొంది. ఈ పరిణామాలు సెన్సార్‌షిప్‌కు దారితీస్తాయని హెచ్చరించింది. స్వేచ్ఛాయుతమైన, నిర్భయమైన పత్రికా వ్యవస్థ ప్రజాస్వామ్యానికి ఎంతో అవసరమని నొక్కిచెప్పింది. ప్రైవేటు సంస్థలకు అనుకూలంగా ప్రభుత్వ చర్యలు ఉంటే అసంతృప్తిని ఏకపక్షంగా అణచివేయడం, ప్రజల సమాచార హక్కుకు భంగం కలిగించడమే అవుతుందని ఎడిటర్స్ గిల్డ్ స్పష్టంచేసింది. కాగా, అదానీపై 200కుపైగా వీడియోలు, పోస్టులను తొలగించడం కోసం తనతో పాటు ఇతర యూట్యూబర్లకు 36 గంటల సమయం ఇచ్చారని, ఉత్తర్వులను సవాల్ చేసే అవకాశం కూడా తమకు ఇవ్వలేదని 'దేశ్‌భక్త్' ఛానల్ నడిపే ఆకాశ్ బెనర్జీ తెలిపారు.

ఆలయాల వద్ద విషాద ఘటనలకు నాదే బాధ్యత

దేవాదాయ మంత్రి ఆనం

రాజీనామాకు వైసీపీ డిమాండ్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: తిరుపతి, సింహాచలం దేవాలయాల వద్ద విషాదకర సంఘటనలు దురదృష్టకరమని... ఇందుకు తనతోపాటు రాష్ట్ర ప్రభుత్వం బాధ్యత వహిస్తుందని దేవాదాయశాఖ మంత్రి ఆనం నారాయణరెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. మండలి ప్రశ్నోత్తరాల్లో వైసీపీ సభ్యులు పి.రామసుబ్బారెడ్డి, వరుదు కల్యాణి, భరత్ తదితరులు అడిగిన ప్రశ్నలకు మంత్రి ఆనం ఈ మేరకు సమాధానమివ్వగా... దానిపై సంతృప్తి చెందని వైసీపీ సభ్యులు తీవ్ర నిరసనకు దిగారు. అనంతరం గత ప్రభుత్వంలో చేసిన తప్పిదాలు అనేకం ఉన్నాయని, వైసీపీ సభ్యులు బాధపడబోమంటే...వాటిని వివరిస్తానని ఆనం బదులిచ్చారు. దీంతో ప్రతిపక్షనేత బొత్సతోపాటు ఇతర సభ్యులు జోక్యం చేసుకుని..అవి మంచిగా లేకుంటే తాము చేసే వ్యాఖ్యలకు మంత్రి బాధపడకూడదని బదులిచ్చారు. ఇంతలో టీడీపీ, వైసీపీ సభ్యుల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. తిరుపతి, సింహాచలం దేవాలయాల వద్ద జరిగిన విషాద ఘటనలకు మంత్రి బాధ్యత వహిస్తున్నట్లు ప్రకటించారని, దీనికి నైతిక బాధ్యత వహించి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. దీంతో ఇరుపక్షాల సభ్యుల మధ్య మాటల యుద్ధం తారాస్థాయికి చేరడంతో సభను వాయిదా వేశారు. తిరిగి సమావేశమయ్యాక గత ప్రభుత్వంలో అనేక దేవాలయాల్లో విగ్రహాలపై జరిగిన దాడుల సంఘటనలను మంత్రి ఆనం వివరిం చారు. ముందు వైసీపీ సభ్యులంతా రాజీ నామా చేస్తే...తానూ రాజీనామా చేస్తానని ప్రకటించారు. దీంతో వైసీపీ సభ్యులు నిరసన తెలుపుతూ వాకౌట్ చేశారు.

– 50 ఏళ్ల పెన్షన్ పథకంపై వైసీపీ సభ్యులు రాజగొల్ల రమేశ్ యాదవ్, భరత్, కవురు శ్రీనివాస్ తదితరులు అడిగిన ప్రశ్నలకు ఎంఎస్‌ఎంఈ కొండపల్లి శ్రీనివాస్ బదులిస్తూ... 50-59 వయసు మధ్య ఉన్నవారు..11,98,501 మంది పెన్షన్ పొందుతున్నారని, ప్రతినెలా ఒకటో తేదీన పేదలకు ఇస్తున్నామని వెల్లడించారు. వృద్ధులకు ఇచ్చే పెన్షన్లను రూ.3 వేల నుంచి 4 వేలకు ఒకేసారి పెంచామని, అర్హులకు ఎక్కడా పెన్షన్లు తొలగించలేదని స్పష్టంచేశారు. పెన్షన్ తీసుకునే భర్త చనిపోతే భార్యకు స్పౌజ్ పెన్షన్ అందిస్తున్నామన్నారు. ఎమ్మెల్సీ రమేశ్ యాదవ్ మాట్లాడుతూ తాము అడిగిన ప్రశ్నకు సమాధానం లేదని, అసలు 50 ఏళ్ల పెన్షన్‌కు సంబంధించి బీసీలు, ఎస్సీలు, ఎస్టీలు, మైనార్టీలు ఎంతెంత మంది అర్హులు?, వారి లెక్కలు తీశారా? అంటూ ప్రశ్నించగా...దానిపై మంత్రి సమాధానం దాటవేశారు.

బాధ్యతారహితంగా మంత్రుల జవాబులు: బొత్స

శాసనమండలిలో ప్రశ్నోత్తరాల సమయంలో సభ్యులు వేసిన ప్రశ్నలకు మంత్రులు బాధ్యతారహితంగా సమాధానాలు వచ్చాయని శాసన మండలిలో వైసీపీ ప్రతిపక్ష నేతల ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణ విమర్శించారు. గురువారం అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద మాట్లాడుతూ... 50ఏళ్లకే పెన్షన్ అన్నారని, అదే అడిగితే దానికి సమాధానం లేదన్నారు. మద్యం విక్రయాలపై సభ్యులు అడిగిన ప్రశ్నలకు డొంకతిరుగుడు జవాబులు తగదని చెప్పారు. కల్తీ మద్యం, బెల్ట్ షాప్‌ల విషయంలోనూ అదే అర్థం లేని మాటలు చెప్పారన్నారు. తిరుపతి, సింహాచలం దేవస్థానాల్లో జరిగిన రెండు దుర్ఘటనల గురించి అడిగితే సూటిగా సమాధానం చెప్పలేదని విమర్శించారు. బాధ్యతారాహిత్యంగా మాట్లాడిన మంత్రి రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ వాకౌట్ చేశామని తెలిపారు.

మహారాష్ట్ర వైద్యుల 24 గంటల సమ్మె

రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వుల ఉపసంహరణకు డిమాండ్

ముంబై: మహారాష్ట్ర వైద్యులు సమ్మె చేశారు. రాష్ట్ర వైద్య మండలిలో మోడరన్ ఫార్మకాలజీలో కోర్సులు చేసిన వారు హోమియోపతి వైద్యులుగా నమోదు చేసుకునేందుకు వీలు కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం వెనక్కు తీసుకోవాలన్న డిమాండ్‌తో 1.8 లక్షల మంది అలోపతి వైద్యులు గురువారం 24 గంటల సమ్మె చేపట్టారు. రాష్ట్రంలోని ప్రైవేటు ఆసుపత్రుల వైద్యులు సమ్మెలో పాల్గొన్నట్లు ఐఎంఏ మహారాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ సంతోశ్ కదం వెల్లడించారు. రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయం వైద్య సేవల నాణ్యతను తగ్గించడమే కాకుండా రోగుల భద్రతకు ప్రమాదకరమని వైద్యుల సంఘం హెచ్చరించింది. మోడరన్ ఫార్మకాలజీ (సీసీఎంపీ)లో ఏడాది సర్టిఫికేట్ కోర్సు చేసిన వారు హోమియోపతి వైద్యులుగా నమోదు చేసుకునేందుకు, కొన్నిసార్లు రోగులకు అలోపతి మందులు ఇచ్చేందుకు అనుమతించేలా ప్రభుత్వం ఈ ఏడాది ప్రారంభంలో మహారాష్ట్ర వైద్య మండలి (ఎంఎంసీ)కి ఆదేశాలిచ్చింది. దీంతో ఐఎంఏ మహారాష్ట్ర సభ్యులు జులై 11న సమ్మెకు సిద్ధమయ్యారు. ముఖ్యమంత్రి ఫడ్నవీస్‌ను కలిసి రోగుల్లో ఉన్న గందరగోళాన్ని వివరించారు. దీంతో ఆ నోటిఫికేషన్‌ను ప్రభుత్వం ఉపసంహరించుకుంది. ఐఎంఏ సభ్యులు కూడా సమ్మెను విరమించుకున్నారు. తాజాగా రిజిస్ట్రేట్ ప్రక్రియను పున:ప్రారంభిస్తూ ఈనెల 5న ప్రభుత్వం సర్క్యులర్ జారీ చేసింది. దీంతో అలోపతి వైద్యులు మండిపడ్డారు. 24 గంటల సమ్మె చేపట్టారు. సమ్మెలో ప్రభుత్వ ఆసుపత్రులు, బ్రిహన్ ముంబై మున్సిపల్ కార్పొరేషన్ మెడికల్ కాలేజీలు, ది ఫెడరేషన్ ఆఫ్ ఆలిండియా మెడికల్ అసోసియేషన్, అసోసియేషన్ ఆఫ్ స్టేట్ మెడికల్ ఇంటర్న్స్, ప్రభుత్వ వైద్య కళాశాల అసోసియేషన్‌ల రెసిడెంట్ వైద్యులు పాల్గొన్నారు.

వదలని వాన

మరో నాలుగు రోజులు వర్షాలు

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: వర్షాలు ఇప్పట్లో ఆగేలా కానరావడం లేదు. గురువారం కూడా అనేక ప్రాంతాల్లో భారీ వర్షాలు కురవగా, ఉపరితల ఆవర్తనం విస్తరించి ఉన్న నేపథ్యంలో రానున్న నాలుగు రోజులు కూడా దక్షిణకోస్తా, రాయలసీమలో విస్తృతంగా పిడుగులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని విపత్తుల నిర్వహణ సంస్థ వెల్లడించింది. సముద్ర, నదీ తీర ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వాతావరణశాఖ హెచ్చరించింది. గురువారం సాయంత్రం 5 గంటల నాటికి అత్యధికంగా తిరుపతి జిల్లా మల్లంలో 70 మి.మీ, కాకినాడ జిల్లా ఇంజరంలో 58 మి.మీ, తిరుపతి జిల్లా కోటలో 52.7 మి.మీ, ప్రకాశం జిల్లా గొల్లవిడిపిలో 52.2 మి.మీ, యర్రగొండపాలెంలో 49.7 మి.మీ, చిత్తూరు జిల్లా దామోదర మహారాజపురంలో 49 మి.మీ, కోనసీమ జిల్లా ఈతకోటలో 47 మి.మీ వర్షపాతం నమోదైందని విపత్తుల శాఖ ఎండీ ప్రఖర్ జైన్ తెలిపారు. వచ్చే నాలుగు రోజుల్లో ప్రకాశం, నెల్లూరు, కర్నూలు, అనంతపురం, కోనసీమ, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, బాపట్ల, పల్నాడు,నంద్యాల, శ్రీసత్యసాయి, కడప, అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో అక్కడక్కడ పిడుగులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలులి కురిసే అవకాశం ఉందని వెల్లడించారు. ఉరుములతో కూడిన వర్షాలు పడేటప్పుడు చెట్ల కింద నిలబడరాదని సూచించారు.

సీఐడీ హోంగార్డు పరీక్షా ఫలితాల వెల్లడి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: నేర పరిశోధన విభాగం హోంగార్డుల పరీక్షా ఫలితాలను ఏపీ సీఐడీ కార్యాలయం గురువారం విడుదల చేసింది. ఈ పోస్టులకు జులై 27 నుంచి 29 వరకు అమరావతిలోని వీఐటీలో నైపుణ్య పరీక్ష నిర్వహించినట్లు ఓ ప్రకటనలో వివరించారు. 5,657 మంది దరఖాస్తు చేసుకోగా 4,223 మంది పరీక్షకు హాజరయ్యారని తెలిపింది. వీరిలో 76 మంది 35 శాతానికిపైగా ఎక్కువ మార్కులు సాధించడం ద్వారా అర్హత సాధించారని పేర్కొంది. వీరంతా డ్రైవింగ్ నైపుణ్య పరీక్ష ఫేజ్-4కు అర్హులని, దీనిని వీలైనంత త్వరగా షెడ్యూలు చేయాలని తెలిపింది. అర్హత సాధించిన అభ్యర్థులు https://citizen.appolice.gov.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలని కోరారు.

జ్యుడిషియల్ కస్టడీకి లలిత్ మోదీ సోదరుడు

న్యూఢిల్లీ: అత్యాచారం కేసులో వ్యాపారవేత్త లలిత్ మోదీ సోదరుడు సమీర్ మోదీని దిల్లీ పోలీసులు అరెస్టు చేశారు. విదేశాలకు వెళ్తున్న ఆయనను దిల్లీ ఎయిర్‌పోర్టులో అదనపు తీసుకున్నారు. కోర్టు ముందు హాజరుపరచగా సమీర్‌కు ఒకరోజు జ్యుడిషియల్ కస్టడీ విధించింది. ఈనెల 19న మరోసారి కోర్టు ముందుర ఆయనను హాజరు పర్చనున్నారు. గతంలో సమీర్‌తో సహజీవనం చేసిన మహిళ ఫిర్యాదు మేరకు సౌత్ ఈస్ట్ దిల్లీలోని న్యూ ఫ్రెండ్స్ కాలనీ పోలీస్ స్టేషన్‌లో ఆయనపై కేసు నమోదైంది. రాజీ కోసం ఆమె రూ.50 కోట్లు డిమాండ్ చేసినట్లు సమాచారం. ఐపీఎల్‌కు బాస్‌గా కోట్లాది రూపాయలు దుర్వినియోగించిన ఆరోపణలతో లలిత్ మోదీ 2010లో లండన్‌కు వెళ్లిపోయి, అక్కడే ఉంటున్నాడు. ఆయనను స్వదేశానికి రప్పించేందుకు భారత్ ప్రయతిస్తుంది.

సైన్యంలో బంధుప్రీతి ఉండదు

సీడీఎస్ జనరల్ అనిల్ చౌహాన్

రాంచీ: సైన్యంలో బంధుప్రీతి ఉండదని సీడీఎస్ జనరల్ అనిల్ చౌహాన్ అన్నారు. జార్ఖండ్ రాజధాని రాంచీలో ఏర్పాటు చేసిన ఓ కార్యక్రమంలో ఆయన ఈ వ్యాఖ్య చేశారు. దేశానికి సేవ చేయాలంటే సైన్యంలో చేరాలని చిన్నారులకు సూచించారు. ప్రకృతి విపత్తులు సంభవించినప్పుడు పౌరులను రక్షించేందుకు సైన్యం కృషి చేస్తుందని అన్నారు. 'బంధుప్రీతి లేని ఏకైక ప్రదేశం సైన్యం. దేశంతో పాటు ప్రపంచాన్ని అన్వేషించాలంటే త్రివిధ దళాల్లో చేరాలని లక్ష్యం పెట్టుకోవాలి. ఇక్కడ కష్టపడితే గుర్తింపు వస్తుంది' అని జనరల్ చౌహాన్ తెలిపారు. మే 7న అర్ధరాత్రి శత్రు స్థావరాలపై దాడులు చేశామని, ఒంటి గంటకు తొలి దాడి జరిగిందని ఆపరేషన్ సిందూర్ గురించి చెప్పారు. సుదీర్ఘ లక్ష్యాలపై రాత్రి వేళల్లో దాడులు చేయాలంటే ప్రత్యేక కృషి అవసరమని అన్నారు.

PRINTED & PUBLISHED BY EDUPUGANTI NAGESHWARA RAO, On Behalf of VISALAANDHRA VIGNANA SAMITI, PRINTED AT AMODA PUBLICATIONS PVT. LTD, D.NO.45-1-1/1, OPP : PORT HOSPITAL, NH-5, AKKAIAPALEM, VISAKHAPATNAM-530004, ANDHRA PRADESH. PUBLISHED AT VISALAANDHRA VIGNANA SAMITI, On Behalf of VISALAANDHRA VIGNANA SAMITI, OPP:SUPER MARKET MAIN ROAD, VISAKHAPATNAM, VISAKHAPATNAM DIST. ANDHRA PRADESH. EDITOR : R.V. RAMARAO. RNI No: APTEL/2013/54657. Postal: Regd.No.VJA:VJ/042/2024-26, Editorial : 9490952834 Manager : 9490952835, 0891-2730748, E-Mail : vizag_visal@yahoo.co.in